ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
గుంటూరు జిల్లా వార్తలు
5
శుక్రవారం 11 జూలై 2025



2027 జనగణన..!



8
- కొన్ని నెలల్లో ప్రక్రియ ప్రారంభమయ్యే అవకాశం
- జిల్లాల వారీగా రానున్న జనాభా లెక్కల స్పష్టత
- గణాంకాల ఆధారంగా అభివృద్ధి, సంక్షేమానికి ప్రణాళిక
- నేడు ప్రపంచ జనాభా దినోత్సవం

మదినిండుగా.. బడి పండుగ

- ఆటపాటలు నృత్యాలతో విద్యార్థుల సందడి
- పాఠశాలల ఆవరణలో మొక్కలు నాటిన తల్లిదండ్రులు
- మొక్కల పంపిణీ.. తల్లి పేరుతో నాటిన విద్యార్థులు

ఉత్సాహంగా మెగా పీటీఎం 2.0


మంగళగిరి : వీవర్స్ కాలనీ ఎంటీఎంసీ హైస్కూల్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ


తెనాలి: రావి సాంబయ్య మున్సిపల్ ఉన్నత పాఠశాలలో చిన్నారులతో కలిసి భోజనం చేస్తున్న మంత్రి మనోహర్, కలెక్టర్ నాగలక్ష్మి

(గుంటూరు/తెనాలి, ఆంధ్రజ్యోతి)

పిల్లలతో కలిసి తల్లిదండ్రులు గురువారం పాఠశాలలకు తరలిరాగా ఉత్సాహపూరిత వాతావరణంలో మెగా పీటీఎం 2.0 జరిగింది. పచ్చని కొబ్బరి మట్టలు, మామిడి తోరణాలు, రంగురంగుల కాగితాలతో పాఠశాలలను విద్యార్థులు అలంకరించి పండుగ వాతావరణం కల్పించారు. ఆటపాటలతో విద్యార్థులు సందడి చేయగా.. పిల్లల నైపుణ్యాలను చూసి.. తెలుసుకుని పెద్దలు సంబరపడ్డారు. పాఠశాలల అభివృద్ధిలో తల్లిదండ్రులు.. పూర్వ విద్యార్థులు.. ప్రజలు భాగస్వామ్యం పెంచి మరింత బలోపేతం చేసేందుకు విద్యాలయాల్లో నిర్వహించిన ఉపాధ్యాయులు.. తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశాలు వేడుకగా జరిగాయి. మదినిండుగా బడి పండుగ కోలాహలంగా జరిగింది. జిల్లాలోని అన్ని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో పీటీఎం 2.0 వేడుకగా జరిగింది. తల్లిదండ్రులు.. అతిథిలకు విద్యార్థులు ఘనంగా స్వాగతం పలికారు. తల్లుల కాళ్లకు పూలతో పూజలు చేసి వారి ఆశీర్వాదం తీసుకున్నారు. తల్లి పేరుతో మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. మొక్కలు నాటిన విద్యార్థులకు గ్రీన్‌కార్డులు అందజేశారు. తల్లిదండ్రులు కూడా పాఠశాలల ప్రాంగణాల్లో మొక్కలు నాటారు. ఎమ్మెల్యేల నంచి

(మిగతా 6లో)


తుళ్లూరు మండలం అనంతవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రుల టీచర్ల మీటింగ్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్


గుంటూరు : అడవి తక్కెళ్లపాడులోని బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో జరిగిన సమావేశంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు

- తెనాలిలోని రావి సాంబయ్య మున్సిపల్ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ నాగలక్ష్మితో కలిసి మంత్రి నాదెండ్ల మనోహర్ పాల్గొన్నారు. పాఠశాలలో మొక్కలు నాటారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు.
- గుంటూరు రూరల్ మండలం అడవి తక్కెళ్లపాడులోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో జరిగిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశంలో ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు పాల్గొని ప్రసంగించారు. కార్పొరేట్ విద్యకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో డిజిటల్ తరగతులను ప్రవేశ పెట్టామన్నారు.
- గుంటూరు తూర్పు నియోజకవర్గం అంజుమన్ పాఠశాల సహా పలు పాఠశాలల్లో పీటీఎం కార్యక్రమాలు జరిగాయి. రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఉండవల్లి శ్రీదేవితో కలిసి ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ అంజుమన్ విద్యార్థులకు విద్యాకిట్లు పంపిణీ చేశారు.
- గుంటూరు పశ్చిమ నియోజకవర్గం అరండల్‌పేటలోని సెయింట్ ఇగ్నేషియస్ స్కూల్‌లో నిర్వహించిన మెగా పేరెంట్స్, టీచర్స్ మీట్ కార్యక్రమానికి ఎమ్మెల్యే గళ్లా మాధవి హాజరయ్యారు. తమ ప్రభుత్వం పాఠశాలల్లో డొక్కా సీతమ్మ మధ్యాహ్నం భోజనం పథకం, సర్వేపల్లి రాధాకృష్ణ విద్యా కిట్లు పంపిణీ, చదువుకున్న ప్రతి విద్యార్థికి తల్లికి వందనం పథకం అమలు చేసిందన్నారు.
- తుళ్లూరు మండలం అనంతవరం జడ్పీ ఉన్నత పాఠశాలలో పీటీఎం కార్యక్రమంలో తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు. పాఠశాలలో పదో తరగతి ఉత్తీర్ణత సాధించి ఇంటర్‌లో చేరిన 24 మంది పేద విద్యార్థులకు రూ.25 వేలు చొప్పున స్కాలర్‌షిప్‌లను దాత మద్దినేని రమేష్ అందజేశారు.
- మంగళగిరిలోని వీవర్స్ కాలనీ ఎంటీఎంసీ హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ పాల్గొన్నారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను సత్కరించి అభినందించారు.


గుంటూరు : విద్యార్థులకు కిట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నసీర్ అహ్మద్, మాదిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఉండవల్లి శ్రీదేవి


గుంటూరు : అరండల్ పేట సెయింట్ ఇగ్నేషియస్ స్కూల్‌లో జరిగిన మెగా పేరెంట్స్- టీచర్స్ మీట్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గళ్లా మాధవి

'బర్డ్'లో ఉచితంగా మోకీళ్ల మార్పిడి ఆపరేషన్లు!

- త్వరలో స్క్రీనింగ్ వైద్య శిబిరాలు
- ఎంపిక చేసిన రోగులకు శస్త్రచికిత్సలు
- బర్డ్ ట్రస్ట్ బోర్డ్ మెంబర్ నన్నపనేని సదాశివరావు వెల్లడి

6

ఖరీఫ్ రుణాల మంజూరులో జాప్యం వద్దు

- డీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు

చిరు కాంట్రాక్టర్లకు తీపి కబురు..


8

సాగర్‌కు జలకళ

540 అడుగులకు చేరిన నీటి మట్టం
శ్రీశైలం నుంచి 1.20 లక్షల క్యూసెక్కులు

(తెనాలి, ఆంధ్రజ్యోతి)

నాగార్జున సాగర్ జలాశయం జలకళ సంతరించుకుంటోంది. శ్రీశైలం నుంచి 1.20 క్యూసెక్కుల ప్రవాహం కొనసాగుతోంది. రెండు రోజుల్లో 22 టీఎంసీల నీటి నిల్వ పెరిగింది. సాగర్ పూర్తిస్థాయి నీటి మట్టం 590 అడుగులు కాగా గురువారం సాయంత్రానికి 541 అడుగులకు చేరింది. 189.33 టీఎంసీలకు నీటి నిల్వ చేరింది. 122.72 టీఎంసీలు వస్తే సాగర్ జలాశయం నిండుతుంది. శ్రీశైలం జలాశయంలోకి గురువారం 1,88,745 క్యూసెక్కుల వరద ప్రవాహం వచ్చింది. శ్రీశైలం గేట్లు తెరిచి, విద్యుత్ ఉత్పత్తి ద్వారా నీటిని సాగర్‌కు విడుదల చేస్తున్నారు.


నాగార్జున సాగర్ జలాశయం

అమ్మో.. రూ.625 కోట్లా?

గుంటూరు చానల్ ఆధునికీకరణ ప్రతిపాదనలపై ఈఎన్‌సీ అభ్యంతరం

అంచనాలు సవరించాలన్న సూచనతో జలవనరుల శాఖ ఇంజనీర్ల కుస్తీ

గుంటూరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): గుంటూరు చానల్ ఆధునికీకరణకు రూ.625 కోట్ల అంచనాలతో రివైజ్డ్ ఎస్టిమేట్లను జలవనరుల శాఖ పంపించింది. అయితే ఒక సాగునీటి ప్రాజెక్టు ఆధునికీకరణకు ఇంత భారీ బడ్జెట్ కేటాయించాలంటే ఆషామాషి కాదంటూ జలవనరుల శాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్ అభ్యంతరం వ్యక్తం చేశారు. అంచనా విలువని బాగా తగ్గించాలని, ఇందుకోసం ప్రతిపాదించిన పనుల్లో కొన్నింటిని తీసేయాలని సూచించారు. దీంతో మరోసారి ఎస్టిమేట్లను రివైజ్ చేసి పంపేందుకు ఆ శాఖ జిల్లా అధికారులు కసరత్తు



చేస్తున్నారు. ఈసారైనా పరిపాలన అనుమతి లభించి ముందడుగు పడుతుందో, లేదోనన్న ఉత్కంఠ ఆ శాఖ వర్గాలతో పాటు ఛానల్ ఆయకట్టు రైతుల్లో నెలకొన్నది. గుంటూరు చానల్ ఆధునికీకరణ ప్రాజెక్టు ప్రతిపాదన ఏ ముహూర్తాన రూపుదిద్దుకున్నదో ఒక పట్టాన కొలిక్కి రావడం లేదు. దశాబ్దాలు గడిచిపోతున్నా ప్రాజెక్టు పరిపాలన అనుమతుల్లోనే కొట్టుమిట్టాడుతున్నది. గట్లు ఎక్కడికక్కడ బలహీనపడి ఉండటంతో గుంటూరు చానల్ సామర్థ్యం 600 క్యూసెక్కులు కాగా గరిష్ఠంగా 300 క్యూసెక్కులు కూడా విడుదల చేయలేని పరిస్థితి. వర్షాల సమయంలో అయితే పంటలు కూడా ముంపు భారిన పడుతున్నాయి. అలానే కాల్వ చివరి భూములకు సాగునీరు అందడం లేదు. వీటికి పరిష్కారంగా చానల్ ఆధునికీకరణ చేయాలని జలవనరుల శాఖ ప్రతిపాదించింది. 0 నుంచి 47వ కిలోమీటర్ వరకు పలుచోట్ల సిమెంట్ కాంక్రీట్ లైనింగ్, గట్లను బలోపేతం చేయడం విస్తరించడం, రెగ్యులేటర్లు కొత్తవి ఏర్పాటు చేయడం వంటి పనులను అధికారులు ప్రతిపాదించారు. దీని వల్ల చానల్‌కు గరిష్ఠంగా 750 క్యూసెక్కుల నీటిని విడుదల చేసేలా డిజైన్లు రూపొందించారు. తద్వారా 27 వేల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ జరగడంతో పాటు కొత్తగా చానల్‌ను పొడిగించేందుకు రూ.625 కోట్ల అంచనాలతో రివైజ్డ్ ఎస్టిమేట్లను జలవనరుల శాఖ ప్రతిపాదించింది. అయితే ఆధునికీకరణ అంశం 2005లోనే తెరపైకి రాగా తొలుత గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ.300 కోట్లకు పరిపాలన అనుమతులు వచ్చాయి. 2019 తర్వాత వైసీపీ ప్రభుత్వం రివర్స్ టెండర్లు నిర్వహించి ఐదేళ్లగా ఒక్క పనిని కూడా ప్రారంభించలేదు. దీంతో అంచనాలు పెరిగి ఇప్పుడు రెట్టింపయ్యాయి. ఒక సాగునీటి ప్రాజెక్టు ఆధునికీకరణకు ఇంత భారీ బడ్జెట్ కేటాయించాలంటే ఆషామాషి కాదని ఈఎన్‌సీ నుంచి ఫైలు వెనక్కు రావడంతో మళ్లీ అధికారులు సవరించే ప్రయత్నాల్లో ఉన్నారు.

రైస్ కార్డు దరఖాస్తులు.. 52,447

38,369 ఆమోదం.. 9,725 తిరస్కరణ.. 4,353 పెండింగు

గుంటూరు, జూలై 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రైస్ కార్డుల దరఖాస్తులు వెల్లువెత్తాయి. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల పరిధిలో మొత్తం 52,447 దరఖాస్తులు వచ్చాయి. వాటిలో 90 శాతం దరఖాస్తులను అధికారులు పరిష్కరించగా 10 శాతం పెండింగులో ఉన్నాయి. గడిచిన రెండు నెలలుగా అధికారులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించారు. కాగా తొలి నెలలో సర్వర్ సమస్యలు, సాంకేతిక ఇబ్బందుల కారణంగా దరఖాస్తులు కొంచెం తక్కువగా వచ్చినా జూన్‌లో మాత్రం వెల్లువెత్తాయి. పౌర సరఫరాల శాఖకు అందిన దరఖాస్తుల్లో ఇప్పటి వరకు 48,094 దరఖాస్తులను అధికారులు పరిష్కరిం చారు. వాటిలో 38,369 దరఖాస్తులకు ఆమోదం లభించగా, 9,725 దరఖాస్తు లను వివిధ కారణాలతో తిరస్కరించారు. మరో 4,353 దరఖాస్తులు వివిధ దశల్లో పెండింగులో ఉన్నాయి. గుంటూరు డివిజన్ పరిధిలో 30454 దరఖా స్తుల్లో 27,781 దరఖాస్తులను పౌర సరఫరాల శాఖ అధికారులు పరిష్కారం చేశారు. తె నాలి డివిజన్ పరిధిలో 21,993 మంది రైస్ కార్డుల సవరణలకు దరఖాస్తు చేసుకోగా 20,313 దరఖాస్తులను పరిష్కరించారు.



జిల్లాలో 8 వేల కొత్త రైస్ కార్డులు

జిల్లాలో ప్రస్తుతం ఉన్న రైస్ కార్డులకుతోడు మరో 8 వేల కొత్త కార్డులు రానున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ప్రస్తుతం వచ్చిన దరఖాస్తుల్లో కొత్త పేర్ల చేర్పు దరఖాస్తులే ఎక్కువ. జిల్లా వ్యాప్తంగా మొత్తం 33,884 దరఖాస్తులు పేర్ల చేర్పుకు సంబంధించినవే కాబట్టి వాటి స్థానంలో కొత్తగా రైస్ కార్డులు వచ్చే అవకాశం లేదు. కాగా కొత్త రేషన్ కార్డుల కోసం 7,962 దరఖాస్తులు వచ్చాయి. వాటిలో 4,624 దరఖాస్తులు ఆమోదం పొందాయి. కార్డు విభజన కోరుతూ 4,909 దరఖాస్తులు రాగా, వాటిలో 3,551 ఆమోదం పొందాయి. ఈ రెండు కేటగిరీల్లో కలిపి 8,205 దరఖాస్తులు ఇప్పటికే ఆమోదం పొందగా మరో 1,181 దరఖాస్తులు పెండింగులో ఉన్నాయి. వాటితోపాటు చిరునామా మార్పు కోరుతూ 2,723, పేర్ల తొలగింపు కోరుతూ 2,300, ఆధార్ సీడింగ్, వివరాలు సరిచేయడంపై 678, షాపు రెన్యువల్ కోరుతూ 12, కార్డు సరెండర్‌కు 19 దరఖాస్తులు వచ్చాయి.

ప్రాజెక్టులకు నిధులు

- నిధుల కేటాయింపునకు మంత్రి మండలి ఆమోదం
- పట్టాలెక్కనున్న వరికపూడిశెల, గోదావరి అనుసంధానం పనులు

రూ.6,399.95 కోట్లు మంజూరు

ప్రకటనలు.. శంకుస్థాపనల హడావుడితో వైసీపీ పాలకులు సరిపెట్టిన సాగునీటి ప్రాజెక్టులకు కూటమి ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు కేటాయించింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఐదేళ్లు అటకెక్కిన సాగునీటి ప్రాజెక్టుల పనులు ప్రస్తుతం పట్టాలెక్కనున్నాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలో కీలకమైన వరికపూడిశెల ఎత్తిపోతల పథకం, గోదావరి-పెన్నా నదుల అనుసంధానం ప్రాజెక్టులకు బుగ్గవాగు అభివృద్ధి పనులకు కలిపి మొత్తం రూ.6,399.95 కోట్లు కేటాయింపులకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది. నీటి పథకాలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాజెక్టుల పనులు పూర్తి చేస్తే సాగు, తాగునీటి సమస్యలకు పరిష్కారం లభిస్తోంది.


నకరికల్లు వద్ద గోదావరి అనుసంధానం ప్రాజెక్టుకు 2018లో సీఎం చంద్రబాబు శంకుస్థాపన చేసిన శిలాఫలకం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

సాగునీటి కరువును శాశ్వతంగా జయించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఈ క్రమంలో వైసీపీ ప్రభుత్వం నిలిపివేసిన ప్రాజెక్టుల పనులను పట్టాలెక్కించే దిశగా నిధులు మంజూరు చేసింది. గోదావరి - పెన్నా నదుల అనుసంధానంలో తొలి విడతలో చేపట్టే గోదావరి జలాలు సాగర్ కుడి కాల్వకు తరలించే ఎత్తిపోతలు, వరికపూడిశెల పథకాలకు నిధులు మంజూరు చేసింది. బుగ్గవాగు గేట్లు పునరుద్ధరణ పనులకు నిధులు కేటాయించింది. గోదావరి పెన్నా నదుల అనుసంధానంలో భాగంగా తొలిదశలో గోదావరి జలాలను సాగర్ కుడి కాల్వకు తరలించే పథకానికి 2018లో అప్పటి చంద్రబాబు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. పల్నాడు, బాపట్ల, గుంటూరు, ప్రకాశం జిల్లాల్లోని 9.61 లక్షల ఎకరాలకు సాగు నీరు అందించేలా ఈ పథకాన్ని రూపొందించింది. అమరావతి మండలం వైకుంఠపురం వద్ద కృష్ణానది నుంచి నీటిని అక్కడి నుంచి 66.59 కిలోమీటర్ల పొడవునా పైపులైన్ నిర్మించి సాగర్ కాల్వ 80వ మైలు వద్దకు గోదావరి నీటిని ఎత్తిపోతల ద్వారా

(మిగతా 6లో)


వరికపూడిశెల నిర్మించే ప్రదేశం

ప్రాజెక్టు	నిధులు (రూ.కోట్లలో)
గోదావరి అనుసంధానం	6,020.15
వరికపూరిశెల	340.26
బుగ్గవాగు	39.54


సభా స్థలిలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు


పూర్తయిన సిట్టింగ్ ఏర్పాట్లు

నేడు వెలగపూడిలో జనాభా దినోత్సవం

హాజరుకానున్న సీఎం చంద్రబాబు.. భారీగా ఏర్పాట్లు

తుళ్లూరు(వెలగపూడి), జూలై 10 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి పరిధిలోని వెలగపూడి రాష్ట్ర సచివాలయం సమీపంలో శుక్రవారం జరిగే ప్రపంచ జనాభా దినోత్సవానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హాజరుకాను న్నారు. ఈ నేపథ్యంలో అధికారులు భారీగా ఏర్పాట్లు చేశారు. ఆయా ఏర్పాట్లను గురువారం రాష్ట్ర ఫైనాన్స్ అండ్ ప్లానింగ్ ప్రిన్సిపల్ సెక్రటరి పీయూష్‌కుమార్, జాయింట్ సెక్రటరి అనంతశంకర్, ఎస్పీ సతీష్‌కుమార్, జేసీ భార్గవతేజ పరిశీలించారు. సభా స్థలి ఏర్పాట్లు, సిట్టింగ్, వాహనాల పార్కింగ్, తాగునీరు, పారిశుధ్య పనులకు సంబంధించి అధికారులకు పలు సూచనలు చేశారు. ముఖ్యమంత్రి పాల్గొనే ఈ కార్యక్రమం విజయవంతానికి అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ రవికుమార్, సీఆర్డీఏ ఈఈ శ్రీనివాసరావు, జడ్పీ సీఈవో జ్యోతిబసు, డ్వామా పీడీ శంకర్, డీపీవో నా గసాయికుమార్, డీఎస్‌డబ్ల్యూ ఆర్‌ఐ సురేష్, తుళ్లూరు, గుంటూరు తూర్పు తహసీల్దార్లు సుజాత, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రాజెక్టులకు నిధులు

(5వ పేజీ తరువాయి)



దెబ్బతిన్న బుగ్గవాగు రిజర్వాయర్ గేట్లు

తరలించేందుకు పథకాన్ని రూపొందించారు. రూ.1,016 కోట్ల వ్యయం కాగల పనులు గతంలోనే పూర్తి అయ్యాయి. వైసీపీ అధికారంలో వచ్చాక ఈ పనులను పూర్తిగా నిలిపి వేసింది. ఈ క్రమంలో గోదావరి-బనకచర్ల అనుసంధానం చేసేందుకు ప్రణాళికను కూటమి ప్రభుత్వం విడుదల చేసింది. విడతల వారీగా నదుల అనుసంధానం పూర్తి చేయాలని నిర్ణయించి జలహారతి అని నామకరణం చేసింది. తొలిదశలో గోదావరి జలాలు 73 టీఎంసీలను జవహర్ కుడి కాల్వ ఆయకట్టు మళ్లించి 9.61 లక్షల ఎకరాలకు నీరు అందించాలన్నది ప్రధాన ఉద్దేశం. ఇందుకు సంబంధించి సుమారు 466 ఎకరాలు భూసేకరణ త్వరలోనే ప్రారంభం కానున్నది. పథకం పూర్తయితే సాగర్ ఆయకట్టులో సాగు చిత్రం పూర్తిగా మారుతుంది.

వరికపూడిశెల కలకు ప్రాధాన్యం..

పల్నాడు జిల్లా పరిధిలోని మాచర్ల, వినుకొండ నియోజకవర్గాల ప్రజలకు అత్యంత ప్రాధాన్యం కలిగిన వరికపూడిశెల ప్రాజెక్టును పట్టాలెక్కించేందుకు రూ.340.26 కోట్లు మంజూరు చేసింది. అధికారంలోకి వచ్చాక మూడేళ్లలో వరికపూడిశెల నిర్మిస్తామని యువగళం పాదయాత్రలో లోకేశ్ హామీ ఇచ్చారు. అన్నట్లుగానే మొదటి దశలో వెల్దుర్తి మండలంలోని 24,900 ఎకరాలకు సాగునీరు అందించే పనులకు నిధులు కేటాయించారు. ప్రాజెక్టు అనుమతులు కేంద్ర ప్రభుత్వం నుంచి లభించడంతో త్వరలోనే పనులు చేపట్టేందుకు ప్రభుత్వం సమాయత్త మవుతోంది.

బుగ్గవాగు అభివృద్ధికి నిధులు

సాగర్ కుడి కాల్వలోని బుగ్గవాగు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ గేట్లు పునరుద్ధరణ, మరమ్మతులకు రూ.39.54 కోట్లు కేటాయించింది. బుగ్గవాగు సామర్థ్యం పెంచాలని దశాబ్దాలుగా జిల్లావాసులు కోరుతున్నారు. నాడు టీడీపీ ప్రభుత్వం బుగ్గవాగు అభివృద్ధికి రూ.202 కోట్లు మంజూరు చేయగా ఆ పనులు నిలిపివేసిన వైసీపీ పాలకులు బుగ్గవాగు సామర్థ్యాన్ని 7 టీఎంసీలకు పెంచుతామని చతికిల పడ్డారు.

మదినిండుగా.. బడి పండుగ

(5వ పేజీ తరువాయి)

వార్డు సభ్యుల వరకు ప్రజాప్రతినిధులు, కలెక్టర్ సహా అన్ని స్థాయిల అధికారులు ఈ కార్యక్రమాల్లో భాగస్వాములయ్యారు. నాణ్యమైన విద్య, పథకాల అమలులో పారదర్శకత, అభివృద్ధి పనుల వేగవంతంపై నిర్ణయాలు తీసుకున్నారు. తరగతుల నిర్వహణ, విద్యార్థుల హాజరు, అభ్యాసన సామర్థ్యాలు తదితర అంశాలపై చర్చించి తీర్మానాలు చేశారు. విద్యార్థుల ప్రోగ్రెస్ కార్డులను తల్లిదండ్రులకు పంపిణీ చేశారు. తల్లిదండ్రులను సమావేశ పరిచి వారితో తాడాట, కుర్చీలాటలు నిర్వహించగా వారంతా కలిసికట్టుగా పాల్గొన్నారు. ముగ్గుల పోటీ, టగ్ ఆఫ్ వార్‌లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. తల్లిదండ్రులు, అధ్యాపకుల మధ్య సత్సంబంధాలు పెంపొందించి విద్యార్థులను తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ప్రజాప్రతినిధులు, అధికారులు వెల్లడించారు. కార్యక్రమం చివర్లో విద్యార్థులతో కలసి తల్లిదండ్రులు, అతిథులు భోజనం చేశారు.

ఖరీఫ్ రుణాల మంజూరులో జాప్యం వద్దు

● డీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు



సమీక్షిస్తున్న చైర్మన్ మల్లికార్జునరావు, సీఈవో అజయ్ కిషోర్

గుంటూరు, జూలై 10(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం ఖరీఫ్ సాగు ప్రారంభమైన నేపథ్యంలో రైతులకు రుణాల మంజూరులో ఎక్కడా జాప్యం చేయొద్దని జిల్లా కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు బ్రాంచ్ మేనేజర్లకు సూచించారు. గుంటూరు బ్రాడీపేటలోని ఎన్‌టీఆర్ సహకార భవన్‌లో గురువారం జిల్లాలోని 42 బ్రాంచ్‌ల మేనేజర్లు, అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రాంచ్‌ల వారీగా రుణాలు, డిపాజిట్‌లు, బకాయిల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా రైతులకు రుణ మంజూరులో ఎటువంటి పొరపాట్లకు తావివ్వకూడదన్నారు. పక్కాగా నిబంధనలు పాటించాల్సిందేనని స్పష్టం చేశారు. అలానే రుణాల రికవరీపై అధికారులు ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. పంట రుణాలతో పాటు ఇతర రుణాలను మంజూరు చేయాలని, డిపాజిట్‌లు పెంచి బ్యాంకు అభివృద్ధికి సమష్టి కృషి చేయాలని దిశానిర్దేశం చేశారు. బ్యాంకు సీఈవో సీహెచ్ అజయ్‌కిషోర్, జీఎంలు కృష్ణవేణి, వీవీఎస్ ఫణికుమార్, కె.మాధవి తదితరులున్నారు.

‘బర్డ్’లో ఉచితంగా మోకీళ్ల మార్పిడి ఆపరేషన్లు!

● జిల్లాలో త్వరలో స్ర్కీనింగ్ వైద్య శిబిరాలు

● ఎంపిక చేసిన రోగులకు శస్త్రచికిత్సలు

● బర్డ్ ట్రస్ట్ బోర్డ్ మెంబర్ నన్నపనేని సదాశివరావు వెల్లడి



నన్నపనేని సదాశివరావు

గుంటూరు మెడికల్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): మోకీళ్ల మార్పిడి ఆపరేషన్లు చేయించుకోవాలని భావించే పేద రోగులకు శుభవార్త. ఖరీదైన మోకీళ్ల మార్పిడి ఆపరేషన్‌లను ఉచితంగా చేసేందుకు తిరుపతికి చెందిన ప్రఖ్యాత ఆసుపత్రి "బాలాజీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సర్జరీ, రీసెర్చ్ అండ్ రీహ్యాబిలిటేషన్ ఫర్ ది డిజేబుల్డ్" (బర్డ్) ఏర్పాట్లు చేస్తోంది. ఇందు కోసం జిల్లాలో ప్రత్యేక స్ర్కీనింగ్ వైద్య శిబిరాలను త్వరలో నిర్వహించనున్నారు. ఈ స్ర్కీనింగ్ క్యాంపుల్లో గ్రేడ్-4 ఆర్థ్రైటిస్‌తో బాధపడే రోగులను గుర్తించి వారికి బర్డ్‌లో ఉచితంగా మోకీళ్ల మార్పిడి ఆపరేషన్లకు ఎంపిక చేస్తారు. ఈ మేరకు జిల్లాలో వైద్య శిబిరాల నిర్వహణకు ప్రత్యేకంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు బర్డ్ ట్రస్ట్ బోర్డ్ సభ్యుడు నన్నపనేని సదాశివరావు తెలిపారు. తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) బోర్డ్ మెంబర్‌గా వ్యవహరిస్తున్న ఆయనను, రెండు రోజుల కిందట బర్డ్ ట్రస్ట్ బోర్డ్ మెంబర్‌గా టీటీడీ దేవస్థానం నియమించింది. బర్డ్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీలో ముగ్గురు సభ్యులు ఉంటారు. ఇప్పటికే డాక్టర్ ఆదిత్ దేశాయ్, తమ్మిశెట్టి జానకీదేవి సభ్యులుగా ఉండగా, మూడో సభ్యుడుగా గుంటూరు జిల్లాకు చెందిన నాట్కో ఫార్మా వైస్ ప్రెసిడెంట్ (కార్పోరేట్ వ్యవహారాలు) నన్నపనేని సదాశివరావును నియమించారు. కీలకమైన ఈ పదవిని చేపట్టిన సదాశివరావును పలువురు అభినందించారు. 300 పడకలతో ఆర్థోపెడిక్ స్పెషాలిటీ హాస్పిటల్‌గా విశిష్టమైన సేవలు అందిస్తున్న బర్డ్ దివ్యాంగులకు కాలిపర్స్‌ను అందజేస్తోంది. మోకీళ్ల మార్పిడితో పాటు పలు రకాల ఆర్థోపెడిక్ సర్జరీలను నిర్వహిస్తోంది. బోర్డ్ ఆఫ్ ట్రస్టీ మెంబర్‌గా ఎంపికైన సదాశివరావు గురువారం ఫోన్ ద్వారా ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. మోకీళ్లు అరిగి రూ.లక్షలు ఖరీదైన నీ రీప్లేస్‌మెంట్ ఆపరేషన్ చేయించుకోలేని పేద రోగులకు ఉచితంగా ఈ ఆపరేషన్లు చేయిస్తామని ప్రకటించారు. బర్డ్‌లో అంతర్జాతీయ నాణ్యత ప్రమాణాలతో పది ఆపరేషన్ థియేటర్లు అందుబాటులో ఉన్నట్లు ఆయన వెల్లడించారు.

అనంతవరం ఆలయ అభివృద్ధికి రూ.10 కోట్లు

రాజధాని గ్రామం అనంతరం కొండపై శ్రీదేవి భూదేవి సమేత మీసాల వెంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి తిరుమల తిరుపతి దేవస్థానం రూ.10 కోట్లు కేటాయించడంలో బోర్డు సభ్యుడు సదాశివరావు కీలక పాత్ర పోషించారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఈ ఆలయాన్ని టీటీడీ దత్తత తీసుకుంది. సదాశివరావు ఆలయాన్ని సందర్శించిన నేపథ్యంలో రైతులు ఆలయ అభివృద్ధి గురించి ఆయన వినతి పత్రం అందజేశారు. మేలో జరిగిన టీటీడీ బోర్డు మీటింగ్‌లో ఆయన ఈ అంశాన్ని ప్రస్తావించారు. చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు నిధులు మంజూరు చేస్తూ తీర్మానం చేశారు. ఆలయాన్ని వైభవంగా తీర్చిదిద్దేందుకు నిధులు కేటాయించారు.

చదువు, అభివృద్ధి సంతోష ప్రక్రియ

➡ డాక్టర్ లావు రత్తయ్య



మాట్లాడుతున్న డాక్టర్ లావు రత్తయ్య

గుంటూరు (విద్య) జూలై 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో చదువు, అభివృద్ధి సంతోషంగా జరగాల్సిన ప్రక్రియని విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య పేర్కొన్నారు. వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో గురువారం నుంచి బీటెక్ మొదటి సంవత్సరం తరగతులు ప్రారంభం సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థుల సర్వతో ముఖాభివృద్ధికి తమ సంస్థలు కృషి చేస్తాయని, చదువుతో పాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు అవసరమైన నైపుణ్యాలను పెంపొందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ వైస్ చాన్సలర్ కల్నల్, ప్రొఫెసర్ పి.నాగభూషణ్, సీఈవో డాక్టర్ మేఘన కూరపాటి, రిజిస్ట్రార్ డాక్టర్ పీఎంవీ రావు, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, తల్లిదండ్రులు, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అంబటి మురళిపై కేసు నమోదు

పొన్నూరుటౌన్, జూలై10(ఆంధ్రజ్యోతి): పొన్నూరు నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి అంబటి మురళీకృష్ణపై అర్బన్ పోలీసులు బుధవారం కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించారు. పోలీసుల కథనం ప్రకారం.. స్థానిక ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్‌పై అసత్య ప్రచారాలు సాగిస్తూ సమాజంలో అంబటి విద్వేషాలు రగిలిస్తున్నారని టీడీపీ పట్టణ అధ్యక్షుడు పఠాన్ అహ్మద్ ఖాన్ అర్బన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే నరేంద్రకుమార్ వీడియోలను మార్ఫింగ్ చేసి.. దుష్ప్రచారం చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రత్యర్థులను భూస్థాపితం చేస్తానని.. ఎమ్మెల్యే అన్నట్లుగా ప్రచారం చేస్తూ.. కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. మన్నవ గ్రామానికి సంబంధించి ఇద్దరి మధ్య జరిగిన గొడవను రాజకీయ దాడులకు ప్రేరేపించే విధంగా వ్యవహరించడంతోపాటు.. ఈ దాడులకు ఎమ్మెల్యే నరేంద్ర కుమార్‌కు సంబంధం ఉందని పలుమార్లు అంబటి మురళీకృష్ణ ప్రచారం చేయడంతో.. తమ మనోభావాలు దెబ్బతిన్నాయని అహ్మద్ ఖాన్ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదు మేరకు అర్బన్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించినట్లు సీఐ వీరనాయక్ గురువారం తెలిపారు.

రాజధాని శంకుస్థాపన ప్రదేశానికి నేడు వైఎస్ షర్మిల రాక

తుళ్లూరు, జూలై 10(ఆంధ్రజ్యోతి) : గత టీడీపీ ప్రభుత్వంలో రాజధాని అమరావతి నిర్మాణానికి ప్రధాని నరేంద్ర మోడీ శంకుస్థాపన చేసిన ఉద్దండ్రాయునిపాలెం ప్రదేశాన్ని ఏపీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల శుక్రవారం సందర్శించనున్నట్లు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిలకా విజయ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సందర్శన అనంతరం స్థానిక రైతులతో ఆమె మాట్లాడతారని పేర్కొన్నారు.. భూముల ల్యాండ్ పూలింగ్ విధానం, రైతులకు రిటర్నబుల్ ప్లాట్ల అభివృద్ధి,పెండింగ్ భూములు, రాజధాని విస్తరణ పేరుతో సేకరించే భూముల గురించి షర్మిల చర్చించి అనంతరం మీడియాతో మాట్లాడతారని విజయ్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు రాజధాని ప్రాంత రైతులు, రైతు కూలీలు పెద్ద ఎత్తున పాల్గొని ఈ పర్యటనను విజయవంతం చేయాలని పేర్కొన్నారు.

అంతర్రాష్ట్ర చైన్ స్నాచర్ అరెస్ట్

గురజాలటౌన్, జూలై 10 (ఆంధ్ర జ్యోతి): అంత ర్రాష్ట్ర చైన్ స్నాచర్‌ను అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ జగదీష్ తెలిపారు. గురువారం పట్టణంలోని తన కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి, వివరాలు వెల్లడించారు. మే 3న రెంటచింతల మండలం మంచికల్లులో జరిగిన చైన్‌స్నాచింగ్ ఏసు విచారణలో.. నిందితుడు బర్మావత్ నాగరాజు అనే వ్యక్తిని గురువారం పట్టణ పోలీసులు పులిపాడు అడ్డరోడ్డు వద్ద అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. తెలంగాణలోని కోదాడ మండలం బాలాజీ నగర్‌కు చెందిన డీజే ఆపరేటర్ నాగరాజు చైన్ స్నాచింగ్‌కు పాల్పడుతున్నాడని తెలిపారు. తెలంగాణతోపాటు గుంటూరు, పల్నాడు జిల్లాల్లో నాగరాజుపై పలు కేసులు ఉన్నట్లు డీఎస్పీ జగదీష్ తెలిపారు.నాగరాజు నుంచి సుమారు రూ.10లక్షల విలువైన 96 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. బైక్‌పై వచ్చి మెడలోని చైన్ స్నాచింగ్‌కు పాల్పడుతున్నట్లు తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.50 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	104, 112, 123
చికెన్ విత్ స్కిన్(కిలో)	200.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	210.00

నేడు సీపీడీసీఎల్..
సీఎండీ పుల్లారెడ్డి పర్యటన

● విద్యుత్ భవన్‌లో సమీక్ష సమావేశం

గుంటూరు, జూలై 10(ఆంధ్రజ్యోతి): సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ (సీఎండీ) పి.పుల్లారెడ్డి, టెక్నికల్ డైరెక్టర్ ఆవుల మురళీకృష్ణ యాదవ్ శుక్రవారం జిల్లా కేంద్రం గుంటూరులో పర్యటించ నున్నారు. ఈ సందర్భంగా సంగడిగుంటలోనున్న విద్యుత్ భవన్‌లో అధికారుల తో సమీక్ష సమావేశం నిర్వహించను న్నట్లు అధికారులు తెలిపారు. జిల్లాలో రెవెన్యూ బకాయితో పాటు వ్యవసాయ కనెక్షన్‌లు, స్మార్ట్ మీటర్ల ఏర్పాటు, ఆర్‌డీఎస్‌ఎస్ పథకం పనుల పురోగతి, పీఎం సూర్య ఘర్ పథకం వంటి వివిధ అంశాలపై సమీక్షించనున్నట్లు పేర్కొన్నా రు. సీఎండీ క్షేత్ర స్థాయిలో డివిజనల్, సెక్షన్ కార్యాల యాలను కూడా సందర్శించనున్నట్లు తెలిపారు.

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ

విద్యావిధానంలో విప్లవాత్మక మార్పులు

● మెగా పేరెంట్ టీచర్స్ మీట్‌లో ఎమ్మెల్యే గళ్లా మాధవి

గుంటూరు, జూలై 10(ఆంధ్రజ్యోతి): మంత్రి నారా లోకేశ్ ఆలోచనలతో విద్యా విధానంలో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్లా మాధవి అన్నారు. అరండల్‌పేట సెయింట్ ఇగ్నిషియస్ స్కూల్‌లో గురువారం నిర్వహించిన మెగా పేరెంట్స్, టీచర్స్ మీట్‌లో మాధవి ముఖ్య అతిథిగా మాట్లాడుతూ ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే 16,347 పోస్టులతో మెగా డీఎస్సీ ప్రకటించి పరీక్షలు పూర్తి చేసిందన్నారు. విద్యార్థులకు డొక్కా సీతమ్మ పేరు మీద మధ్యాహ్నం భోజనం పథకం ఏర్పాటు చేసిందని, సర్వేపల్లి రాధాకృష్ణ పేరు మీద విద్యార్థులకు కిట్లు పంపిణీ చేసిందని, చదువుతున్న ప్రతి విద్యార్థికి తల్లికి వందనం పథకం కింద రూ.13వేలు జమ చేశామని చెప్పారు. గత వైసీపీ ప్రభుత్వం నాసిరక దుస్తులు, స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారని ఎమ్మెల్యే గళ్లా మాధవి విమర్శించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ శ్రీవల్లి, రావెల వెంకటయ్య, వకుళ దేవి, గోపి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న భాష్యం రామకృష్ణ

విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి

గుంటూరు(విద్య), జులై 10(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి భాష్యం విద్యా సంస్థలు కృషి చేస్తున్నాయని సంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ తెలిపారు బుధవారం మెగా పేరెంట్స్ మీట్స్ సందర్భంగా భాష్యం మెయిన్ క్యాంపస్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అభిరుచులకనుగుణంగా వారు సర్వతోముఖాభివృద్ధిని సాధించడానికి తమ వంతు కృషి చేస్తున్నట్లు రామకృష్ణ వివరించారు. కార్యక్రమంలో గుంటూరు మున్సిపల్ కార్పొరేటర్ కొమ్మినేని కోటేశ్వరరావు, రెవెన్యూ సర్వేయర్ సునీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డొక్కా మాణిక్యవరప్రసాదు, పాల్గొన్న పూజారులు

హైందవ సంస్కృతికి విస్తృత ప్రచారం కల్పించాలి

● మాజీ మంత్రి మాణిక్య వరప్రసాదు

గుంటూరు(తూర్పు), జూలై 10(ఆంధ్రజ్యోతి): టీటీడీ దేవస్థానంలో మాదిగ పూజారులకు గౌరవ వేతనం ఇచ్చి, హైందవ సంస్కృతికి విస్తృత ప్రచారం కల్పించాలని మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాదు ప్రభుత్వాన్ని కోరారు. గురుపౌర్ణమి పురస్కరించుకుని స్థానిక అరండల్‌పేటలోని శ్రీ మోహన్ రంగనాయక స్వామివారి దేవస్థానంలో ఆది గురువు జాంబవదేవునికి ఆయన ప్రత్యేకపూజలు, హోమాలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాస్టర్‌లకు, దేవాలయ పూజారులకు మాదిరిగానే మాదిగ, మాల పూజారులకు కూడా గౌరవ వేతనం ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. హిందూ దేవాలయాల్లో మాదిగ, మాల పూజారులకు అవకాశాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో బీ జే పీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు, చావలి బాలస్వామి, అత్తోట జోసెఫ్ కుమార్, దాసరి జాన్ బాబు, టి వంశీతిలక్, వెంకట నరసయ్య, మురిగేషన్ తదితరులు పాల్గొన్నారు.

మూర్ఛ వ్యాధి కారణంగా యువకుడు ఆత్మహత్య

గుంటూరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): మూర్ఛ వ్యాధి కారణంగా మనస్థాపానికి గురైన ఓ యువకుడు అధిక మోతాదులో ఫిట్స్ బిళ్ళలు మింగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎన్టీఆర్ కాలనీ నాలుగో లైన్ కి చెందిన ఉప్పుదల దుర్గారావు (22) ఆత్మహత్యాయత్నం చేసి చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక అరండల్ పేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎన్టీఆర్ కాలనీ నాలుగో లైన్ కి చెందిన ఉప్పుదల శివరామయ్య, లత దంపతుల కుమారుడు దుర్గారావుకు ఏడు సంవత్సరాల వయసు నుంచే ఫిట్స్ వ్యాధి ఉంది. అప్పటి నుంచి మందులు వాడుతున్నాడు. ఇటీవల కూలి పనులకు వెళుతూ ఉండగా అక్కడ బిళ్లలు వేసుకుంటే తోటి కూలీలు చూసి నవ్వుతున్నారని మందులు వేసుకోవడం మానేశాడు. మందులు వేసుకోకుంటే ఇబ్బంది పడతావ్ అంటూ తల్లి మందలించింది. దీంతో మనస్థాపానికి గురైన దుర్గారావు బుధవారం సాయంత్రం ఇంటి వద్ద ఫిట్స్‌కు సంబంధించిన 80 బిళ్ళలు మింగాడు. దీంతో కుటుంబ సభ్యులు వెంటనే దుర్గారావును జీజీహెచ్‌కు తరలించగా అప్పటినుండి చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. తల్లి లత ఫిర్యాదు మేరకు అరండల్ పేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులు లక్ష్యాలు నిర్దేశించుకుని చదవాలి

నగర కమిషనర్ పులి శ్రీనివాసులు



మాట్లాడుతున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు (విద్య), జూలై 10 (ఆంధ్రజ్యోతి): పాఠశాల దశలోనే విద్యార్థులు భవిష్యత్ లక్ష్యాలను నిర్దేశించుకుని చదువుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు సూచించారు. ఏటుకూరులోని జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం జరిగిన మెగా పేరెంట్ మీట్‌లో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వై వాణి, నియోజకవర్గ నాయకులు ఉగ్గిరాల సీతారామయ్య, కార్పొరేటర్ దాసరి లక్ష్మీదుర్గ వాసు, ఉగ్గిరాల ఉదయచంద్రరావు, శ్రీనివాసరావు, నవీన్, చిరంజీవి, అంకమరాజు, ఉపాధ్యాయు లు కె.బసవలింగారావు, వేణుగోపాలరావు, శ్రీనివాస్, పద్మావతి, మారుతి, రాజ్యలక్ష్మి, సత్యప్ర భ, హసీనా, సుజాత తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల వెంబడి ఆక్రమణలు తొలగించాలి

గుంటూరు కార్పొరేషన్, జూలై 10(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో ప్రధాన రోడ్ల వెంబడి ఆక్రమణలను స్వచ్ఛందంగా తొలగించుకోవాలని, లేకుంటే నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళిక సిబ్బందే తొలగిస్తారని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. గురువారం కేవీపీ కాలనీ, జోసఫ్ నగర్, కావేరి కాలనీ తదితర ప్రాంతాల్లో ప్రధాన రోడ్ల ఆక్రమణలను పరిశీలించి తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో త్వరలో వీధివ్యాపారుల కోసం వెండింగ్ జోన్లను ఏర్పాటు చేయనున్నామని, ట్రాఫిక్‌కి, డ్రెయిన్ల వ్యర్థాలు తీయడానికి ఆటంకంగా ఉన్న రోడ్, డ్రెయిన్ల ఆక్రమణలను స్వచ్ఛందంగా తొలగించుకోవాలన్నారు. ఆయా ఆక్రమణదారులు నగరపాలకసంస్థ ఏర్పాటుచేయనున్న వెండింగ్ జోన్లలో వ్యాపారం చేసుకోవడానికి వెండింగ్ కార్డ్ల కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. పట్టణ ప్రణాళిక, ప్రజారోగ్య అధికారులు, సిబ్బంది తమ పరిధిలో ఆక్రమణదారులకు నోటీసులు ఇవ్వాలని ఆదేశించారు. పర్యటనలో డీఈఈ వెంకటరమణ, ఏసీపీ వెం కటేశ్వరరావు, ఇంజనీరింగ్, ప్రజారోగ్య, పట్టణ ప్రణాళిక అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

మంత్రి లోకేశ్ కృషితో యువతకు బంగారు భవిత

● గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్

గుంటూరు, జూలై 10(ఆంధ్రజ్యోతి): మంత్రి లోకేశ్ కృషితో యువత భవితకు బంగారు బాటలు పడుతున్నాయని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అన్నారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని అంజుమన్ పాఠశాల సహా పలు పాఠశాలల్లో గురువారం జరిగిన మెగా పేరెంట్స్- టీచర్స్ మీట్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవితో కలిసి విద్యార్థులకు ఆయన కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దే గొప్ప గురువు విద్యేనన్నారు. పిల్లలకు చదువుతోపాటు కమ్యూనికేషన్ స్కిల్స్‌లో నైపుణ్యం సాధించేలా కృషి చేయాలని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు సూచించారు.

అంజుమన్ పాఠశాల చరిత్రలో తొలిసారి మధ్యాహ్న భోజన పథకం

అంజుమన్ ఏ ఇస్లామియా పాఠశాల చరిత్రలో ఎన్నడూలేని విధంగా మధ్యాహ్న పథకం అమలు చేస్తున్నామని ఎమ్మెల్యే నసీర్ చెప్పారు. పాఠశాలలో గురువారం ఆయన మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించారు. అనంతరం విద్యార్థులకు రాధాకృష్ణన్ విద్యా కిట్లను అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చిట్టా బత్తిని చిట్టిబాబు, కార్పొరేటర్లు ఎల్లవుల అశోక్, ఇర్రి ధనలక్ష్మి, అన్వర్, జాబి, బెళ్ళ వెంకటేశ్వర్లు, పిచ్చి రెడ్డి, జాగర్లమూడి శ్రీనివాస్, శైలజ, రవీంద్రబాబు, ఏడుకొండలు, సాయి, వెంకట రమణ, రాజా, బాజీ, రియాజ్, ఇర్రి సాయి, వెంకట్, హేమంత్, షౌకత్, జహీద్, సైదా తదితరులు పాల్గొన్నారు.



అంజుమన్ పాఠశాల విద్యార్థులతో ఎమ్మెల్యే నసీర్, చిట్టిబాబు

సమ సమాజ నిర్మాణానికి గురువుల కృషి ఎనలేనిది

గుంటూరు(తూర్పు), జూలై 10(ఆంధ్రజ్యోతి): సమసమాజ నిర్మాణ స్థాపనకు గురువుల కృషి ఎనలేనిదని తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహమద్, బీజేపీ తూర్పు నియోజకవర్గ కన్వీనర్ డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్ కొనియాడారు. గురుపౌర్ణమి పురస్కరించుకుని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రముఖ యోగా గురువు జుజ్జూరు శ్రీనివాసరావు దంపతులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు మద్దిరాల మ్యానీ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

మేయర్ కోవెలమూడి భూమికి అక్రమ రిజిస్ట్రేషన్

● వడ్డమానులో పూలింగ్ భూమి.. తిరువూరులో రిజిస్ట్రేషన్

● సబ్ రిజిస్ట్రార్ బాణావతు జగన్మోహనరావుపై డీఐజీ వేటు

విజయవాడ, జూలై 10 (ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధాని తుళ్లూరు మండలం వడ్డమానూలో గుంటూరు మేయర్ కోవెలమూడి నానికి చెందిన పూలింగ్‌లో ఉన్న నాలుగు ఎకరాల భూమిని ఎన్టీఆర్ జిల్లా తిరువూరులో అక్రమంగా రిజిస్ట్రేషన్ చేశారు. ఇందుకు సంబంధించి తిరువూరు సబ్ రిజిస్ట్రార్ బాణావతు జగన్మోహనరావును విజయవాడ డీఐజీ రవీంద్రనాథ్ సస్పెండ్ చేశారు. మూడు రోజుల కిందటే ఈ ఘటన జరిగినా.. రిజిస్ట్రేషన్ శాఖ ఉన్నతాధికారులు అత్యంత రహస్యంగా ఉంచారు. ఇందుకు సంబంధించిన వివరాలు.. తన భూమిని శివశంకరరెడ్డి అనే వ్యక్తి మరో వ్యక్తికి రిజిస్ట్రేషన్ చేయించినట్లు అందుకు సబ్ రిజిస్ట్రార్ బాణావతు జగన్మోహనరావు సహకరించినట్లు రిజిస్ట్రేషన్ శాఖ ఉన్నతాధికారుల దృష్టికి కోవెలమూడి తీసుకెళ్లారు. దీనిపై విజయవాడ డీఐజీ విచారణ జరిపారు. ప్రాథమిక విచారణలో అక్రమ రిజిస్ట్రేషన్‌గా తేలడంతో బాణావతు జగన్మోహనరావును సస్పెండ్ చేశారు. శివశంకరరెడ్డి అనే వ్యక్తి ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్(ఎఫ్ఎంసీ), డెత్ సర్టిఫికెట్లను చూపి ఆ భూమి తమదేనని పార్టీషన్ చేయించుకున్నట్లు సమాచారం. 1బీ రికార్డును పరిశీలిస్తే భూమిపై వారికి వాస్తవ హక్కులు ఉన్నాయా లేదా అన్నది తెలిసేది. పార్టీషన్ డీడ్స్‌కు సంబంధించి పూర్వార్జితాలకు 1బీ పరిశీలన అవసరం లేదన్న నిబంధనను ఆధారంగా చేసుకుని సబ్ రిజిస్ట్రార్ రిజిస్ట్రేషన్ చేసినట్లుగా తెలుస్తోంది. రిజిస్ట్రేషన్ జరిగిన వెంటనే కోవెలమూడి నాని బంధువులు తిరువూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చి ఇవి తమ భూములని, అక్రమ రిజిస్ట్రేషన్ ఎలా చేస్తారని గొడవ చేశారు. శివశంకరరెడ్డిపై తిరువూరు పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. కేసు పెట్టినప్పటి నుంచి సబ్ రిజిస్ట్రార్ సెలవులో ఉన్నారు. శివశంకరరెడ్డి ఎవరు, ఏ ప్రాంతానికి చెందిన వ్యక్తి అన్న దానిపై స్పష్టత రావాల్సి ఉంది.



సమావేశంలో మాట్లాడుతున్న గాదె వెంకటేశ్వరరావు

రాష్ట్రంలో అలజడులు సృష్టించేందుకు జగన్ రెడ్డి కుట్రలు

● వారు వైసీపీ నేతలు కాదు... దండుపాళ్యం బ్యాచ్

● ధ్వజమెత్తిన జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె

గుంటూరు మెడికల్, జూలై 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో భారీగా పెట్టుబడులు పెట్టేందుకు పలు పేరున్న కంపెనీలు ముందుకు రావడం వైసీపీ నేతలకు నచ్చడం లేదని, వీటిని అడ్డుకొనేందుకు, అలజడులు సృష్టించేందుకు దండుపాళ్యం బ్యాచ్ మాదిరిగా వైసీపీ నేతలు కుట్రలు పన్నుతున్నారని జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు మండిపడ్డారు. గురువారం పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. చిత్తూరు జిల్లా బంగారుపాళ్యానికి వెళ్లిన వైసీపీ అధినేత జగన్‌మోహన్ రెడ్డి నానా హంగామా చేశారని విమర్శించారు. మామిడి రైతులను పరామర్శించేందుకు పాతికవేల మందితో వెళతారా? అని ఆయన నిలదీశారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు చూసి ఓర్చుకోలేక అలజడులు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆయన ఆరోపించారు. పరామర్శ పేరిట వేలాది మందితో వస్తున్న జగన్, అలజడులు సృష్టించి ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆయన ధ్వజమెత్తారు. జగన్‌మోహన్‌రెడ్డి పరామర్శ యాత్రలో ఇప్పటికే ముగ్గురు చనిపోయారని గాదె తెలిపారు. మామిడి దిగుబడి అధికంగా రావడంతో సహజంగా ధరలు తగ్గాయని, అయినప్పటికీ ఎన్‌డీఏ ప్రభుత్వం రైతులను ఆదుకొనేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. వైసీపీ నేతలు బరితెగించి టీడీపీకి చెందిన మహిళా ఎమ్మెల్యేపై సభ్య సమాజం తలదించుకొనే విధంగా బూతులు మాట్లాడటం వారి నీచ సంస్కృతికి నిదర్శనమని గాదె వెంకటేశ్వరరావు దుయ్యబట్టారు. విలేకర్ల సమావేశంలో జనసేన కార్పొరేటర్ యర్రంశెట్టి పద్మావతి, నేతలు అడపా మాణి క్యాలరావు, బిట్రగుంట మల్లిక, శిఖా బాలు, మధులాల్ తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో గురుపౌర్ణమి

గుంటూరు(తూర్పు), జూలై 10 (ఆంధ్రజ్యోతి): నగరంలో గురుపౌర్ణమి వేడుకలు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా సాయిబాబా ఆలయాలను నిర్వాహకులు పూలతో ప్రత్యేకంగా ఆలంకరించారు. సాయినాథునికి పంచామృతాలతో అభిషేకం, అలంకారపూజ, అర్చన తదితర కార్యక్రమాలను వేద పండితులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయాల్లో భక్తులచే గురు చరిత్ర పారాయణం, సాయి నాథుని సంకీర్తన చేశారు. భక్తులు, ప్రజా ప్రతినిధులు పెద్దఎత్తున బాబా వారిని దర్శించుకుని తీర్థ, ప్రసాదాలు స్వీకరించారు. పలు ఆలయాల్లో భక్తులకు అన్నవితరణ గావించారు. స్థానిక విద్యానగర్లో 3వ లైన్లోని శ్రీ సాయినాథుని సన్నిధానంలో గురు పౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఉత్సవాల్లో భాగంగా ముగింపు రోజైన శుక్రవారం అఖండ దీపానికి ఉద్వాసన, పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సన్నిధానం గౌరవ అధ్యక్షుడు యడ్లపాటి ఆశోక్‌కుమార్ తెలిపారు.



నల్లపాడు, సాయి నాథ మందిరంలో ప్రత్యేక అలంకరణలో బాబావారు

● స్థానిక నెహ్రూనగర్‌లోని అయ్యప్ప స్వామి దేవాలయంలో గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా నెహ్రూనగర్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో మాజీ రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ దాసరి రాజా మాస్టారు, యర్రపోగు నాగేశ్వరరావు తదితరులు పాల్గొని భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు.



బాబా వారి ఆలయంలో శివ లింగానికి పాలాభిషేకం చేస్తున్న భక్తులు

కనుల పండువగా శ్రీ కనకదుర్గమ్మకు ఆషాడమాసం సారె

గుంటూరు, జూలై 10(ఆంధ్రజ్యోతి): సంగడిగుంట లాంచెస్టర్ రోడ్డులోనున్న శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారికి ఆషాడమాసం సారె బహూకరణ గురువారం కన్నుల పండువగా జరిగింది. మేళతాళాలు మధ్య ముత్తైదువలు లాంచెస్టర్ రోడ్డులో శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం నుంచి ప్రదర్శనగా కనకదుర్గమ్మ ఆలయంలో సారె సమర్పించారు. ఆషాడ మాసం, గురుపౌర్ణమి సందర్భంగా అమ్మవారికి శాస్త్రోక్తంగా సారె సమర్పించటం జరిగిందని ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు మారెడ్డి శ్రీనివాసరెడ్డి, మూరబోయిన నరసింహారావులు తెలిపారు. అమ్మవారి ఆలయంలో ఆషాడమాసం పురస్కరించుకొని ప్రత్యేక కుంకుమార్చనలు, పూజలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కమిటీ ఉపాధ్యక్షులు మద్దిరెడ్డి జగన్మోహన్‌రెడ్డి, అరవ ఆంజనేయులు, కల్లి శ్రీనివాసరెడ్డి, అప్పారావు, సాంబశివరావు తదితరులున్నారు.

● శాకాంబరి అలంకరణలో చుట్టుగుంట పోలేరమ్మ దర్శనం

చుట్టుగుంట వద్ద వేంచేసిన శ్రీ పోలేరమ్మ తల్లి అమ్మవారు గురువారం శాకాంబరి దేవి అలంకరణలో దర్శనమిచ్చారు. ఆషాడ మాసం పురస్కరించుకొని భక్తులు తీసుకొచ్చి కూరగాయాలతో అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. శాకాంబరి అలంకరణలో అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు ఉదయం నుంచే క్యూ కట్టారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

● ఆర్ అగ్రహారం కోనేరు రోడ్డులోనున్న శ్రీ షిర్డీ సాయి మందిర్‌లో గురుపౌర్ణమి సందర్భంగా ఆలయంలో విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వివిధ పూలతో స్వామిరిని విశేషంగా అలంకరించారు. ఉదయం నుంచే భక్తులు స్వామి వారిని దర్శించుకునేందుకు బారులు తీరారు. ఈ సందర్భంగా అన్న సంతర్పణ కార్యక్రమం నిర్వహించినట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు తిరుమలశెట్టి శివరామకృష్ణ, తూనుగుంట్ల నాగేశ్వరరావులు తెలిపారు. కార్యక్రమంలో పలువురు కమిటీ సభ్యులు ఉన్నారు.





విద్యానగర్‌లో ప్రత్యేక అలంకరణలో బాబా వారు



బ్రాడీపేట 4వ లైన్‌లో ప్రత్యేక అలంకరణలో బాబావారు, సాయినాథుని దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

అంబేడ్కర్ భవన్ నిర్మాణ పనులను పూర్తి చేయాలి

గుంటూరు(తూర్పు), జూలై 10(ఆంధ్రజ్యోతి): గుంటూరులో నాలుగు వైపుల క్రైస్తవుల సమాధి తోటలకు స్థలాలను కేటాయించాలని, ఏసీ కళాశాల ఎదురుగా ఉన్న అంబేడ్కర్ భవన్ నిర్మాణ పనులను పూర్తి చేయాలని ఇద్వా వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ గోళ్లమూడి రాజాసుందరం బాబు కోరారు. ఈ మేరకు సచివాలయంలో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి బాల వీరాంజనేయ స్వామికి, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎండీ ఫరుక్‌కు వినతిపత్రాలను అందజేశారు. పదేళ్లగా నిలిచిపోయిన అంబేద్కర్ భవన్ పనులను పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. నల్లపు నీలాంబరం, చిన్నం డేవిడ్ విలియమ్స్, బండ్లమూడి స్టాలిన్, కొప్పుల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఘనంగా మెగా పేరెంట్స్ మీట్



విద్యార్థులకు ప్రగతి పత్రాలు అందజేస్తున్న ప్రిన్సిపాల్ ఉమాదేవి తదితరులు

గుంటూరు(విద్య), జూలై10 (ఆంధ్రజ్యోతి): స్థానిక సాంబశివపేటలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో బుధవారం మెగా పేరెంట్స్ మీట్ ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో డీవీఈఓ పద్మ, ఆర్ఐఓ జి.సునీత తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపకుల మధ్య సత్సంబంధాలు పెంపొందించి విద్యార్థులను తీర్చిదిద్దటమే లక్ష్యంగా ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. విద్యార్థులు భవిష్యత్తు ప్రణాళికలు నిర్దేశించుకుని ముందుకు సాగాలని ఆర్జేడీ పద్మ, ఆర్ఐఓ సునీత తదితరులు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

లఘు ఉద్యోగ భారతి రాష్ట్ర అధ్యక్షుడిగా యోగీష్‌చంద్ర

● సర్వసభ్య సమావేశంలో ఎన్నిక

గుంటూరు, జూలై 10(ఆంధ్రజ్యోతి): లఘు ఉద్యోగ భారతి రాష్ట్ర అధ్యక్షుడుగా తులసీ గ్రూపు సంస్థల ఎండీ తులసీ యోగీష్‌చంద్ర ఎన్నికయ్యారు. అరండల్ పేటలోని కార్యాలయంలో సర్వ సభ్య సమావేశంలో ముఖ్య అతిథిగా లఘు ఉద్యోగ భారతి అఖిల భారత సంఘటన కార్యదర్శి ప్రకాష్ చంద్ర హాజరై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర లఘు ఉద్యోగ భారతి నూతన కమిటీని ప్రకటించారు. రాష్ట్ర కమిటీ అధ్యక్షులుగా తులసి యోగీష్ చంద్ర, ప్రధాన కార్యదర్శిగా అట్లూరి రమేష్, కోశాధికారి ధరణీష్ ధనికుల, ఉపాధ్యక్షులుగా కమల నయన్‌బంగ్, రామలింగ, నల్లమోతు శివప్రసాద్, సంయుక్త కార్యదర్శిగా గుత్తా సుబ్రహ్మణ్యేశ్వరరావు, కార్యదర్శులుగా అట్లూరి సునీతా నారాయణ, హరిదాసుల చంద్రశేఖర్, తోట రామకృష్ణ, దాట్ల తిరుపతి రాజు, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా శ్రీధర్ చిట్టిప్రోలు, విఠల్ ప్రసాద్, మార్పు వెంకటేశం, పందిళ్లపల్లి ప్రవీణ్, రాజులపాటి వెంకటరాజశేఖర్ ఎన్నుకున్నట్లు ప్రకాష్‌చంద్ర తెలిపారు. ఈ సమావేశంలో గత రెండు సంవత్సరాల సంస్థ ప్రగతి, ఆర్థిక నివేదికను సమర్పించారు. ప్రకాష్ చంద్ర మాట్లాడుతూ చిన్న తరహా పరిశ్రమలు ఎదుర్కొనే సమస్యల పరిష్కారానికి 'లఘు ఉద్యోగ భారతి' జాతీయ స్థాయిలో పోరాడుతుందని వివరించారు. చిన్న, పెద్ద తరహా పరిశ్రమలు ఎదుర్కొనే ఎటువంటి సమస్యలనైనా జాతీయ స్థాయిలో ప్రభుత్వ దృష్టికి లేదా బహుళ జాతీయ కంపెనీల దృష్టికి తీసుకువెళ్లేందుకు వారితో 'లఘు ఉద్యోగ భారతి' అనుసంధానం కలిగివుందన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు తులసి యోగీష్ చంద్ర మాట్లాడుతూ రాష్ట్రం లోని చిన్న తరహా పరిశ్రమల సమస్యల పరిష్కారానికి తన శాయశక్తులా పనిచేస్తానని అయితే సభ్యుల సంఖ్య పెరిగినప్పుడే మన వాణి గట్టిగా వినిపించటానికి అవకాశముంటుందని, సభ్యుల సంఖ్య 150 నుండి 1000 వరకు పెరగటానికి కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా తులసి గ్రూప్ అధినేత తులసి రామచంద్ర ప్రభు, పాపులర్ షూమార్ట్ అధినేత చుక్కపల్లి అరుణ్ కుమార్, రామచంద్ర బ్రదర్స్ అధినేత పుప్పాల సుబ్బారావు, ఆక్వా వాటర్ కంపెనీ అధినేత శ్రీ సాయి, సత్యా ఇంపెక్స్ అధినేత తోటా రామకృష్ణ, ఇంకా పలువురు సభ్యులు యోగీష్ చంద్రకు అభినందనలు తెలియజేశారు.



ఎన్నికైన తులసీ యోగీష్‌చంద్ర, పక్కన జాతీయ కార్యదర్శి ప్రకాష్ చంద్ర, తులసీ సంస్థల అధినేత రామచంద్రప్రభు తదితరులు

విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తున్న ప్రభుత్వాలు

● కలెక్టరేట్ ఎదుట పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో నిరసన

గుంటూరు(తూర్పు), జూలై 10(ఆంధ్రజ్యోతి): విద్యా రంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కే భాస్కర్, ఎం వినోద్ కుమార్ విమర్శించారు. సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురువారం కలెక్టరేట్ ఎదుట చేపట్టిన ధర్నాలో వారు మాట్లాడారు. గత ప్రభుత్వంలో తీసుకున్న అనాలోచిత నిర్ణయాలను ప్రస్తుత ప్రభుత్వం అనుసరిస్తుందని విమర్శించారు. పాఠశాలల విలీన ప్రక్రియను తక్షణమే ఉపసంహరించుకోవాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 9450 ఏకోపాధ్యాయ పాఠశాలలను నడుపుతున్నారని, ఇది సరైన విధానం కాదన్నారు. ప్రభుత్వం స్పందించి సమస్యలను పరిష్కారించాలని డిమాండ్ చేశారు. ఏఎన్‌యూలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలన్నారు. నిరసనల్లో రాజశేఖర్, సునీల్, మహర్షి, రాజేష్, లోకేష్, మానస, రమణ, సావిత్రి, ప్రసాద్, నరేంద్ర రామయ్య తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు బొమ్మిడాల సేవలు ఎనలేనివి

గుంటూరు(తూర్పు), జూలై 10(ఆంధ్రజ్యోతి): సామాజిక బాధ్యతతో పాటు గ్రామీణ ప్రాంత విద్యార్థుల విద్యాభివృద్ధికి ఇతోధికంగా ఆర్థిక చేయూతనందిస్తున్న బొమ్మిడాల భానుమూర్తి సేవలు అభినందనీయమని ఏపీ స్టేట్ అకౌంటెంట్ జనరల్, ఐఏఎస్ అధికారి శాంతి ప్రియ అన్నారు. స్థానిక విద్యానగర్, ఓ హోటల్లో జరిగిన బొమ్మిడాల సంస్థ ఉద్యోగులు, వ్యాపారుస్తులు నిర్వహించిన ఆత్మీయ సమావేశానికి ఆమె ముఖ్య అతిధిగా హజరై మాట్లాడారు. కష్టపడే తత్వం, నిజాయితీతోనే వ్యాపార సంస్థలు వృద్ధిలోకి వస్తాయని చెప్పారు. వ్యాపారాల్లో వచ్చిన లాభాల్లో కొంత శాతం సామాజిక సేవలకు వినియోగించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో ప్రతిభ చూపిన ఉద్యోగులకు చైర్మన్ భానుమూర్తి, ఐఏఎస్ శాంతి ప్రియ, డైరెక్టర్లు భావన్నారాయణ, కోటి రత్నం, రాజ వరప్రసాద్, భాను ప్రకాష్‌ల చేతుల మీదుగా అవార్డులను అందజేశారు.



ప్రసంగిస్తున్న శాంతి ప్రియ, వేదికపై బొమ్మిడాల భానుమూర్తి

బంధం..బాధ్యత..భరోసా..!



నకరికల్లు పాఠశాలలో పిల్లలను ఆశీర్వదిస్తున్న తల్లులు..



చిలువూరులో బిడ్డతో కలిసి భోజనం చేస్తున్న తల్లి

పాఠశాలల్లో గురువారం నిర్వహించిన మెగా పేరెంట్స్ అండ్స్ టీచర్స్ మీటింగ్(పీటీఎం) 2.0 ఒక పండగ వాతావరణం తలపించింది. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో పాటు.. ప్రజా ప్రతినిధులను, పూర్వ విద్యార్థులను భాగస్వామ్యం చేయడంతో.. బంధం, బాధ్యత, భరోసా వికసించాయి. పిల్లల ఎదుగుదలను, నైపుణ్యాలను తెలుసుకుని..తల్లిదండ్రులు.. సంతోష పడ్డారు. ఆనందంగా వారే పిల్లలై.. ఆటల పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు తామేం చేస్తున్నామో.. చేయాలో వివరిస్తూ.. తమ బాధ్యతను మరోసారి గుర్తెరిగారు. ప్రజా ప్రతినిధులు విద్యాభివృద్ధికి, ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు, వసతుల కల్పనకు తమవంతు సహకారం ఎల్లప్పుడూ కల్పిస్తామని భరోసా కల్పించారు. తమకు విద్యా బుద్ధులు నేర్పిన బడి అభివృద్ధికి ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటామని పూర్వ విద్యార్థులు చెప్పుకొచ్చారు. మొత్తం మెగా పీటీఎం 2.0.. మెగా విజయవంతమైంది.

- ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్



కర్లపాలెంలోని ఓ ప్రైవేట్ స్కూల్లో మొక్క అందుకున్న సంతోషంలో..



గుంటూరులోని పాఠశాలలో ఆశీర్వాదం తీసుకుంటున్న చిన్నారులు



వేమవరం పాఠశాలలో హాజరైన తల్లిదండ్రులతో ఉపాధ్యాయులు



సత్తెనపల్లి ఉన్నత పాఠశాలలో ఉత్సాహంగా తాడు లాగుతున్న తల్లులు

2027 జనగణన..!

- రెండేళ్లలో ప్రారంభమయ్యే అవకాశం
- జిల్లాల వారీగా రానున్న జనాభా లెక్కల స్పష్టత
- గణాంకాల ఆధారంగా అభివృద్ధి, సంక్షేమానికి ప్రణాళిక
- నేడు ప్రపంచ జనాభా దినోత్సవం

గుంటూరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): దేశంలో 2011 నుంచి జనాభా లెక్కలు తేల్చకపోవడంతో.. జిల్లాలో జనాభాపై స్పష్టత లేకుండా ఉంది. కేవలం ప్రొజెక్షన్స్ మాత్రమే జిల్లా యంత్రాంగం వద్ద అందుబాటులో ఉంది. దీంతో సంక్షేమ, అభివృద్ధి ప్రణాళికలు, కార్యక్రమాలు రూపొందించి అమలు చేయడంలో కొన్ని సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. పదేళ్లకోసారి జనాభ లెక్కలు దేశ వ్యాప్తంగా జరుగుతాయి. 2021 జనగణన కరోనా కారణం వల్ల ఆగితే..మరో వైపు రాజకీయ రంగు అంటుకుంది. కొన్ని రాజకీయ పార్టీలు ప్రతిఘటించడంతో ఈ ప్రక్రియ ఆగిపోయింది. ఎట్టకేలకు ఇటీవలే కేంద్ర ప్రభుత్వం తాజాగా జనాభా లెక్కలకు ఆదేశాలు జారీ చేసింది. జనగణన 2027లోనే జరిగే అవకాశం ఉంది.





ఉమ్మడి గుంటూరు జిల్లా మ్యాపు..

యువతకు సాధికారత..

జూలై 11న ప్రపంచ జనాభ దినోత్సవాన్ని జరుపుతారు. 1987లో ఇదే తేదీన ప్రపంచ జనాభ ఐదు బిలియన్లకు చేరుకోవడంతో ఆ రోజు నుంచి ప్రతి సంవత్సరం వరల్డ్ పాపులేషన్ డే నిర్వహిస్తున్నారు. కుటుంబ నియంత్రణ, లింగ సమానత్వం, పేదరికం, తల్లి ఆరోగ్యం, మానవ హక్కులు వంటి వివిధ జనాభ సమస్యలపై ప్రజలకు అవగాహన పెంచడమే ఈ కార్యక్రమం లక్ష్యం. కాగా ఏటా ఏదో ఒక ఇతివృత్తాన్ని యూఎన్ సెక్రటరీ జనరల్ ప్రకటిస్తారు. న్యాయమైన, ఆశాజనకమైన ప్రపంచంలో తాము కోరుకునే కుటుంబాలను సృష్టించుకోవడానికి.. యువతకు సాధికారమివ్వడం అనే ఇతివృత్తంతో 2027 ప్రపంచ జనాభా దినోత్సవాన్ని జరపాల్సిందిగా ఐక్యరాజ్య సమితి ఆదేశించింది.

2011లో ఉమ్మడి గుంటూరు జనాభా

ఉమ్మడి గుంటూరు జిల్లా జనాభా.. 2011 జగన గణన ప్రకారం 48,87,813 మందిగా తేల్చారు. అందులో మహిళలు 24,40521, పురుషులు 24,47,292 మందిగా ఉన్నారు. అప్పటి వరకు ఎనిమిది నుంచి తొమ్మిది శాతం మధ్యన ప్రతి పదేళ్ల కోసారి జనాభ పెరుగుదల నమోదయ్యేది. అనంతరం కుటుంబ నియంత్రణపై ప్రజల్లో అవగాహన పెరగడంతో.. ఒకరు లేదా ఇద్దరు పిల్లలు అన్న భావనలో తల్లిదండ్రులు ఉన్నారు. మారిన జీవన శైలి, ఆహారపు అలవాట్లు కూడా సంతానోత్పత్తిపై ప్రభావం చూపుతున్నాయి. బాగా వయస్సు మీద పడిన తర్వాత పురుషులు, మహిళలు పెళ్లి చేసుకొంటున్నారు. అప్పటికే వయస్సు మీరిపోతుండటంతో పెళ్లి కాని ప్రసాదులు మిగిలిపోతున్నారు. ఒకవేళ పెళ్లి అయినా చాలా సంవత్సరాల పాటు పిల్లలు పుట్టక మానసికంగా ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ప్రభుత్వాలు కూడా ఒకరిద్దరికే సంతానం పరిమితం చేయాలని చెప్పేవి. నేడు ఎక్కువ మందిని కనాలని ప్రజాప్రతినిధులు బహిరంగ సభల్లోనే పిలుపునిస్తున్నారు. మన శక్తి అంతా యువతేనని, దాంతోనే ప్రపంచంలో అగ్రగామిగా ఎదగొచ్చని చెబుతున్నారు.

విస్తరిస్తున్న పట్టణాలు

కాగా జనసాంద్రత పెరుగుతున్న కారణంగా పల్లెల నుంచి పట్టణాలకు వలసలు రెట్టింపు అయ్యాయి. అలానే పట్టణ ప్రాంతాలు క్రమేపి విస్తరిస్తున్నాయి. దీంతో పొలాలు కాస్త రియల్ ఎస్టేట్ వెంచర్లుగా మారిపోతున్నాయి. కొత్తగా పొలాలు సాగులోకి రాని పరిస్థితి ఏర్పడింది. గుంటూరు నగరాన్ని తీసుకొంటే అమరావతి రోడ్డు, ఏటుకూరు రోడ్డు, పొన్నూరు రోడ్డు, నల్లపాడు, పెదపలకలూరు, నందివెలుగు రోడ్ల వైపు భారీగా పట్టణం విస్తరించింది. మంగళగిరి, తాడేపల్లి అయితే ఒకవిధంగా కలిసిపోయాయి. అమరావతి రాజధాని కారణంగా ఈ రెండిటిని ఒక మునిసిపల్ కార్పొరేషన్‌గా చేయడంతో అక్కడొక నగరం రూపాంతరం చెందుతోంది. త్వరలో అమరావతి రాజధాని నగరం అందుబాటులోకి రానుంది. తెనాలి, నరసరావుపేట, పొన్నూరు, చిలకలూరిపేట, వినుకొండ, మాచర్ల పట్టణాలు విస్తరిస్తున్నాయి.

సస్పెన్షన్ ఎత్తివేత

- విధుల్లో చేరిన 9 మంది మున్సిపల్ ఉద్యోగులు

చిలకలూరిపేట, జూలై 10 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట మున్సిపాలిటీలో గతంలో జరిగిన రూ.34 లక్షల కుంభకోణంలో సస్పెండ్ అయిన 9 మంది ఉద్యోగులను గుంటూరు మున్సిపల్ రీజినల్ డైరెక్టర్ ఉత్తర్వుల మేరకు గురువారం తిరిగి విధుల్లోకి తీసుకున్నారు. వీరంతా వేర్వేరు మునిసిపాలిటీలలో ప్రస్తుతం పని చేస్తున్నారు. వీరిలో నరసరావుపేట మున్సిపాలిటీకి చెందిన నలుగురు, చిలకలూరిపేటకు చెందిన ఇద్దరు, వెంకటగిరికి చెందిన ఇద్దరు, చీరాలకు చెందిన ఒకరు ఉన్నారు. కందుకూరులో మునిసిపల్ మేనేజర్‌గా పనిచేసిన విజయలక్ష్మి సస్పెన్షన్ ఇంకా కొనసాగుతోంది. ఉద్యోగుల సస్పెన్షన్ ఎత్తివేసినప్పటికీ వారిపై విచారణ కొనసాగుతుంది.

అసలు ఏం జరిగిందంటే..

చిలకలూరిపేట మునిసిపల్ ఖజానాకు డబ్బు జమ చేయడానికి వచ్చిన ప్రజలకు నకిలీ రసీదులు ఇచ్చి.. రూ.34,34,397 కాజేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో జరిగిన ఈ కుంభకోణంలో.. అవుట్ సోర్సింగ్ ఉద్యోగి గంగా భవాని ప్రధాన బాధ్యురాలిగా అధికారులు గుర్తించారు. ఆమెపై పోలీసు కేసు కూడా నమోదైంది. చాలా కాలంగా గంగా భవాని పరారీలో ఉంది. మున్సిపల్ కౌన్సిల్ సమావేశాల్లో టీడీపీ కౌన్సిలర్లు అధికారులను ఈ అంశంపై నిలదీశారు. అధికారులు స్పష్టత ఇవ్వకుండా కాలం గడిపారు. ఈలోగా రూ.12 లక్షల నగదు ఖజానాకు జమ అయ్యింది. ఇంకా రూ.22 లక్షలకు పైగా జమ కావాల్సి ఉంది. కూటమి ప్రభుత్వం వచ్చాక ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు దీనిపై దృష్టి సారించారు. ప్రాథమిక విచారణ జరిగింది. మొత్తం 15 మంది మున్సిపల్ సిబ్బంది దీనికి బాధ్యులని విచారణలో తేల్చారు. వీరిలో ఒకరు చనిపోయారు. పలువురు వేర్వేరు మునిసిపాలిటీలకు బదిలీ అయ్యారు. వీరిలో పది మందిని విధుల నుంచి సస్పెండ్ చేశారు. మరో నలుగురు ఉన్నతాధికారులపై చర్యలకు ప్రభుత్వానికి సిఫార్సు చేశారు. సస్పెండ్ అయిన ఉద్యోగులందరూ కలిసి రూ.22 లక్షల పెండింగ్ మొత్తాన్ని మునిసిపాలిటీకి ఇటీవలే జమ చేశారు. దీనితో ప్రస్తుతానికి సస్పెన్షన్ ఎత్తివేశారు. ఈ కుంభ కోణంపై సమగ్ర విచారణ జరిపించాలని మునిసిపల్ శాఖ మంత్రి పి. నారాయణకు ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు ఇటీవలే లేఖ రాశారు. ఈ కుంభకోణంపై విజిలెన్స్ విచారణ కోరుతూ మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని రాసిన లేఖను కూడా ఆయన మంత్రి నారాయణకు పంపించారు.

ఆంధ్రప్రదేశ్ మీ అయ్య జాగీరు కాదు

- దేశంలో, ఏపీలో అంబేడ్కర్ రాజ్యాంగం నడుస్తోంది
- జెండా మోసిన ప్రతి కార్యకర్తకు న్యాయం చేస్తా
- ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు వెల్లడి

మాచవరం, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : 'ఆంధ్రప్రదేశ్ మీ అయ్య జాగీరు కాదు... దేశంలో అంబేడ్కర్ రాజ్యాంగం ఎలా నడుస్తుందో ఆంధ్రప్రదేశ్‌లో అదే రాజ్యాంగం నడుస్తుంది, మీ తాత రాజారెడ్డి రాజ్యాంగం ఇక్కడ నడవదు.' అని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం రాత్రి మాచవరం మండలంలోని శ్రీ రుక్మిణీపురం గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమానికి ఎమ్మెల్యే యరపతినేని ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ తల్లికి వందనం నగదు ఎంత మంది పిల్లలకు వచ్చిందని తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. వృద్ధుల యోగ క్షేమాల తెలుసుకుంటూ.. ప్రజలను ఉత్సాహపరిచారు. గ్రామంలో పార్టీలకు అతీతంగా ప్రతి ఇంటికి తిరుగుతూ కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల కర పత్రాలను అందజేసి, వాటి గురించి ప్రజలకు వివరించారు. అనంతరం పార్టీ మండల అధ్యక్షుడు బడిగుంచల వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నంగా ఉన్నప్పటికీ సీఎం చంద్రబాబు నాయుడు ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ వస్తున్నారని తెలిపారు. అదే విధంగా గురజాల నియోజక వర్గంలో కూడా ఇప్పటికే సుమారు రూ.800 కోట్లతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలతో పాటు సంక్షేమ పథకాలు అందించటం జరిగిందన్నారు. రాష్ట్రం విడి పోయినప్పుడు చంద్రబాబు నాయుడుని ఏపీలోకి తీసుకురావడం గురజాల నియోజక వర్గం నుంచే ప్రారంభమైందని గుర్తుచేశారు.



దివ్యాంగురాలు రాజేశ్వరికి కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే

అప్పుడు రూ.3వేలు.. ఇప్పుడు రూ.6 వేలు

గత వైసీపీ ప్రభుత్వంలో దివ్యాంగురాలు కింద మూడు వేలు రూపాయలు తీసుకున్నానని, కూటమి ప్రభుత్వం రాగానే ఆరు వేల రూపాయలు తీసుకుంటున్నానని శ్రీ రుక్మిణీపురం గ్రామానికి చెందిన దివ్యాంగురాలు రాజేశ్వరి ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావుకు చెప్పింది. పుట్టుకతోనే దివ్యాంగురాలై నడవలేని స్థితిలో ఉన్న రాజేశ్వరి పరిస్థితిని గమనించిన యరపతినేని నేల మీద కూర్చొని ఆమె ఆరోగ్య పరిస్థితులు, కుటుంబ విషయాలు తెలుసుకున్నారు. సర్టిఫికెట్‌లో 90 శాతం వైకల్యం ఉందని ఆమె ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వచ్చింది. రూ.15వేలు పింఛన్ వచ్చే విధంగా ఉన్నతాధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటానని యరపతినేని దివ్యాంగురాలికి హామీ ఇచ్చారు.

జెండా మోసిన ప్రతి కార్యకర్తకు న్యాయం చేస్తా

అధికారంలో ఉన్నా, అధికారంలో లేకున్నా తనను ఎప్పుడూ నియోజక వర్గ ప్రజలు ఎమ్మెల్యేగానే చూశారని, మాజీ ఎమ్మెల్యేగా ఎప్పుడూ చూడలేదన్నారు యరపతినేని. పార్టీ జెండా మోసిన ప్రతి కార్యకర్తకు న్యాయం చేస్తానని సభలో యరపతినేని తెలిపారు. శ్రీ రుక్మిణీపురంలో తొలిసారి 1994లో ఎమ్మెల్యే అయిన తర్వాత తానే తారు రోడ్డు వేయించానని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు రాజశేఖరరెడ్డి, పిడుగురాళ్ళ మార్కెట్ యార్డు చైర్మన్ వీరాస్వామి, స్థానిక నాయకులు దేశబోయిన అప్పారావు, తుల్లిబిల్లి రాధాకృష్ణ, మార్కెట్ యార్డు డైరెక్టర్ కోటయ్య, తుల్లిబిల్లి అసనయ్య, పిడుగురాళ్ల జెడ్పీటీసీ సభ్యుడు జంగా వెంకటకోటయ్య తదితరులు పాల్గొన్నారు.

చిరు కాంట్రాక్టర్లకు తీపి కబురు..

- ఉపాధి హామీ పథకం పెండింగ్ బిల్లులకు మోక్షం
- 2014- 19 పనులకు.. రూ. 180 కోట్లు విడుదల
- నెల రోజుల్లో మెటీరియల్ సప్లయర్స్‌కు అందించే అవకాశం

గుంటూరు, జూలై 10(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పనుల కోసం మెటీరియల్ సప్లై చేసిన చిరు కాంట్రాక్టర్లకు కేంద్రం తీపి కబురు చెప్పింది. 2014- 19 మధ్యన జాతీయ ఉపాధి హామీ పథకం కింద రాష్ట్రంలో జరిగిన పలు పనులకు సంబంధించి పెండింగులో ఉన్న బకాయి రూ.180 కోట్లను కేంద్రం విడుదల చేసింది.

గత ప్రభుత్వం కక్ష సాధింపు..

ఎన్ఆర్ఈజీఎస్ పనుల్లో భాగంగా 2014- 19 మధ్య చిన్న స్థాయి మెటీరియల్ సప్లయర్స్ చేపట్టిన రూ. 250- 300 కోట్ల విలువైన పనులకు సంబంధించి గత వైసీపీ ప్రభుత్వం కక్ష సాధింపు ధోరణి అవలంబించింది. సాఫ్ట్‌వేర్ మార్పులతో పాటు, సప్లయర్ల బిల్లులు మొత్తం ఆపివేయడం జరిగింది. గత ఆరు సంవత్సరాలుగా వీరికి ఒక్క పైసా బిల్లులు కూడా చెల్లించలేదు.

నెల రోజుల్లో చెల్లింపులు..

కూటమి బాధ్యతలు స్వీకరించిన తరువాత కేంద్ర, రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖల మధ్య సమన్వయం జరిగి, పాత సాఫ్ట్‌వేర్‌ను తిరిగి అమలులోకి తీసుకొచ్చారు. 4.3 లక్షల పనుల్లో 3.5 లక్షల పనులను తిరిగి గుర్తింపులోకి తెచ్చి వాటికి నిధులు మంజూరయ్యేలా చేశారు. మిగిలిన పనుల్లోని సాంకేతిక సమస్యలను పరిశీలించి పరిష్కరించడంపై చర్యలు చేపడుతున్నారు. ఈ క్రమంలోనే దాదాపు రూ.180 కోట్ల పెండింగ్ బిల్లులను కేంద్ర ప్రభుత్వం విడుదల చేయనుంది. రాష్ట్ర ప్రభుత్వం కూడా తగిన మ్యాచింగ్ గ్రాంట్స్ కేటాయించి, వచ్చే 30 రోజుల్లోగా అన్ని బిల్లులను కాంట్రాక్టర్లకు చెల్లించేలా గ్రామీణాభివృద్ధి శాఖకు స్పష్టమైన ఆదేశాలు జారీ అయ్యాయి. ఆ మేరకు మంత్రివర్గ స్థాయిలో జరిగిన సమీక్షలో నిర్ణయం తీసుకున్నారు. దీంతో రూ. 5 నుంచి రూ.15 లక్షల మేర బిల్లులు పెండింగ్ ఉన్న 3.5 లక్షల మంది మెటీరియల్ సప్లయర్స్‌కు న్యాయం జరుగుతుందని తెలుస్తోంది.

న్యాయం చేసిన కూటమి ప్రభుత్వం: కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని

ఈ సందర్భంగా కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ ఈ ప్రతిష్ఠాత్మక అంశంపై కేంద్రం, రాష్ట్రం మధ్య సమర్థమైన సమన్వయం నెలకొల్పడంలో సీఎం చంద్రబాబు, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పవన్ కల్యాణ్, కూటమి ఎంపీల చొరవ కీలకంగా ఉందన్నారు. జరిగిన పనులను జరగలేదంటూ వైసీపీ గడిచిన ఐదేళ్లలో ఆ బిల్లులను తొక్కి పెట్టినప్పటికీ మెటీరియల్ సప్లయర్లకు కూటమి ప్రభుత్వం న్యాయం చేసిందన్నారు. కక్ష సాధింపులు ఎల్లకాలం చెల్లవని మరోసారి రుజువైందని మంత్రి పెమ్మసాని పేర్కొన్నారు.

మొన్న అలా.. నేడు ఇలా..!

- ప్రభుత్వ డొంక రోడ్డు ఆక్రమణ ● ఆంధ్రజ్యోతి కథనంతో వెలుగులోకి ● రైతుల నుంచి వ్యతిరేకత



సిమెంటు రోడ్డు వేసి.. గోడ కట్టేసిన ఐవోసీ

గుంటూరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ డొంక రోడ్లపై ప్రైవేటు వ్యక్తులతో పాటు.... బడా కార్పొరేషన్ల కన్ను కూడా పడింది. తాడేపల్లి పాత జాతీయ రహదారి వెంట ఉన్న ఐటీసీ వెనుక ఉన్న సర్వే నంబరు 255, 275-1ఎ, 302, 316-1లలో ఉన్న 2.04 ఎకరాల ప్రభుత్వ భూమిని తమకు కేటాయించాలని ఓ ఎమ్మెల్యే బంధువుకు చెందిన స్థిరాస్తి వ్యాపారి ఏకంగా రెవెన్యూ అధికారులకు అర్జీ పెట్టుకున్న విషయాన్ని ఆంధ్రజ్యోతి వెలుగులోకి తెచ్చిన విషయం తెలిసిందే. ఈ కథనంపై స్పందించిన రైతులు ప్రభుత్వ భూములు ప్రైవేట్ వ్యక్తులకి కేటాయించ వద్దు అంటూ వ్యతిరేకతను తెలియజేస్తూ అర్జీలు ఇచ్చారు. తాజాగా అదే జాతీయ రహదారి వెంట ఉన్న ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ సంస్థ రైతుల పొలాలకు వెళ్లే డొంక రోడ్‌ను సీసీ రోడ్‌గా మార్చుకొని రైతులు వారి పొలాల వైపు వెళ్లకుండా అడ్డుగోడను నిర్మించారంటూ పలువురు రైతులు గుంటూరు కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశారు. సదరు రైతుల ఫిర్యాదు ప్రకారం సర్వే నెంబర్ 319-1ఎ, 320 -1డీఎ, 313-2బి భూములలో తమ పొలాలు ఉన్నాయని, అటు వైపు వెళ్ళడానికి పాత జాతీయ రహదారి నుంచి ఆర్.ఎస్. నెంబర్ 303లో 39 సెంట్లు ప్రభుత్వ డొంక దారి ఉందని కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. కాగా ఆ భూమిలో ఐఓసీ అడ్డుగా గోడ నిర్మించడం వల్ల, తమ పొలాలకు వెళ్ళడానికి ఇబ్బంది పడుతున్నామని, కలెక్టర్ పరిశీలించి తగు చర్యలు తీసుకొని, పొలాలకు వెళ్లే డొంక దారిని పునరుద్ధరించాలని రైతులు కోరారు. రాజధానిలో ఎకరం భూమి రూ. ఐదు కోట్లకు పైగా ఉండటంతో ఎవరికి వారు ప్రభుత్వ భూమి కనిపించిందే తడవుగా పాగా వేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ అయిన ఐవోసీ మినహాయింపు కాకపోవడం కొసమెరుపు.

రప్పా రప్పా అంటే.. ప్రజలు చిత్తుగా ఓడిస్తారు

- హింసను ప్రేరేపించడమే జగన్ ధ్యేయం ● మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి

రెంటచింతల,జూలై 10 (ఆంధ్రజ్యోతి) : మహిళలంటే గౌరవం లేదని, నోటికి ఏదొస్తే అది మాట్లాడడం, హింసను ప్రేరేపించి జనాన్ని చంపడం వైసీపీ నైజమని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి విమర్శించారు. 11 సీట్లిచ్చి జనం ఛీకొట్టినా ఇంకా వైసీపీ నేతలకు సిగ్గురాలేదన్నారు. ఓ మహిళా ఎమ్మెల్యే వ్యక్తిత్వాన్ని హననం చేస్తూ.. మాజీ మంత్రి, ఎమ్మెల్యే మాట్లాడడం ఏంటని ప్రశ్నించారు. గురువారం రెంటచింతలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వైసీపీ నాయకులు రప్పా రప్పా అంటూ ప్రజలను భయపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. ఇదే పద్ధతి కొనసాగితే.. స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు 2029 ఎన్నికల్లో ఆ పార్టీకి డిపాజిట్లు కూడా రావని దుయ్యబట్టారు. మామిడికి గిట్టుబాటు ధరతో పాటు టన్నుకు రూ.4 వేల రాయితీని సీఎం చంద్రబాబు ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. మాజీ సీఎం జగన్ పర్యటనకొస్తే ప్రాణాలు పోవాల్సిందేనని అప్రమత్తంగా ఉండాలని సూచించారు. టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శి పంగులూరి పుల్లయ్య, మండల అధ్యక్ష,ఉపాధ్యక్షులు అబ్బిరెడ్డి, శ్రీనివాసరావు, సుమంత్‌రెడ్డి, శౌరెడ్డి, రామకృష్ణ, రాయపరెడ్డి,వెన్నా కృష్ణారెడ్డి, నాళం పెదబాబు, ప్రభురాజ్, మందలపు హనిమిరెడ్డి, అల్లం బ్రహ్మారెడ్డి, సిద్దయ్య, దానయ్య, కోటేశ్వరరావు, సాయి పాల్గొన్నారు.

చేనేత కార్మికుడికి జాతీయ అవార్డు



డిజైన్‌లో నిమగ్నమైన కర్నాటి మురళి

సత్తెనపల్లి, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : పట్టణానికి చెందిన చేనేత కార్మికుడు కర్నాటి మురళి వీవింగ్‌లో జాతీయ అవార్డుకు ఎంపికయ్యాడు. 40 సంవత్సరాలుగా చేనేతలో మురళీ వివిధ డిజైన్‌లు తయారు చేస్తున్నాడు. టై అండ్ డై డిజైన్ చేయడంలో అతను సిద్ధహస్తుడు. అమరావతిలోని నేషనల్ ఇనిస్ట్యూట్ ఆఫ్ డిజైన్‌లో మురళి శిక్షకుడిగా వ్యవహరిస్తున్నారు. ఇటీవల మురళీ మల్టీ డైమండ్ డిజైన్ చారిని తయారు చేశాడు. ఆ చారిని విజవాడలోని వీవర్స్ సర్వీస్ సొసైటీకి పంపించాడు. అక్కడ మురళీ డిజైన్‌ను గుర్తించిన అధికారులు ఢిల్లీలోని వీవర్స్ సర్వీస్ సెంటర్‌కు డిజైన్ వివరాలను పంపించారు. అక్కడ అధికారులు వీవింగ్ సెక్షన్‌లో మురళిని జాతీయ అవార్డుకు ఎంపిక చేశారు. ఆగస్టు 7న ఢిల్లీలో రాష్ట్రపతి చేతుల మీదుగా మురళీ అవార్డు అందుకోనున్నారు. 30 సంవత్సరాలుగా వివిధ డిజైన్‌లలో చేనేత వస్త్రాలను తయారు చేస్తున్నట్లు మురళీ గురువారం రాత్రి ఆంధ్రజ్యోతికి తెలిపారు. అవార్డుకు ఎంపిక కావడం ఎంతో సంతోషానిచ్చిందన్నారు.

దుగ్గిరాల యార్డులో పసుపు ధరలు

దుగ్గిరాల, జూలై 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక పసుపు మార్కెట్ యార్డులో వారం జరిగిన వేలంలో కేవలం 743 బస్తాల పసుపు విక్రయాలు జరిగాయి. కొమ్ములు, కాయ ఒకేధరలు పలికాయి. క్వింటాల్‌కు కనిష్ఠధర రూ.10.100, గరిష్ఠధర రూ.10,725, మోడల్‌ధర రూ.10,100 పలికాయి. క్వింటాల్‌కు కనిష్ఠధర రూ.10.100, గరిష్ఠధర రూ.10,101, మోడల్‌ధర రూ.10,100 పలికాయి..

హజ్‌యాత్రకు 31లోగా దరఖాస్తు చేసుకోండి

దుగ్గిరాల, జూలై 10(ఆంధ్రజ్యోతి): హజ్ యాత్రకు వెళ్లదలచిన వారు ఈ నెల 31వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని రాష్ట్ర హజ్ కమిటీ సభ్యురాలు, ఎంపీపీ షేక్ జబీన్ గురువారం ఓ ప్రకటనలో కోరారు. హజ్ 2026 దరఖాస్తు ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైందని, అధికారిక హజ్‌పోర్టల్ లేదీ హజ్ సువిధ మొబైల్‌యాప్ ద్వారా గానీ దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు.

నేడు ఆర్టీసీ డయల్ యువర్ డీఎం

మంగళగిరిసిటీ, జూలై 10 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి ఏపీఎస్‌ఆర్టీసీ డిపో పరిధిలో ఈ నెల 11వ తేదీ ఉదయం 11 నుంచి 12 గంటల వరకు డయల్‌యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు డిపో మేనేజరు రెంటపాళ్ల పిచ్చియ్య తెలిపారు. మంగళగిరి ప్రాంత ప్రయాణికులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని, తగిన సలహాలు, సూచలు అందించాలని ఆయన కోరారు. డయల్ యువర్ డీఎం కోసం వారు సెల్: 99592 25424 నెంబరులో సంప్రదించాలని సూచించారు.

చలపతి అధ్యాపకుడికి డాక్టరేట్

తాడికొండ(లాం), జూలై 10 (ఆంధ్రజ్యోతి) : లాం చలపతి ఇంజనీరింగ్ కళాశాలలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న యర్రా నాగసుబ్రహ్మణ్య వంశీమోహన్‌కు తమిళనాడులోని అన్నా యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసిందని కళాశాల ప్రిన్సిపాల్ ఎం చంద్రశేఖర్ గురువారం తెలిపారు. వంశీమో హన్ తన పరిశోధన ఆప్టికల్ మాడ్యూలేషన్ పథకాలతో ఫ్రీ స్పేస్ ఆప్టికల్ మాధ్యమం లక్షణాలపై పరిశోధనలు చేపట్టినట్లు తెలిపారు. ప్రొఫెసర్ ఏ శివ నంతరాజా పర్యవేక్షణలో పరిశోధనలు చేశారు. రక్షణశాఖ రంగంలో హైస్పీడ్ వైర్ లెస్ డేటా ట్రాన్స్ మిషన్‌లో, 5జీ నెట్‌వర్క్ సమాచారంలో, డ్రోన్స్ సమాచార వ్యవస్థలో విపత్తులు గురించి తెలుసుకొని నిరోధించటంలో ఉపయోగపడుతుందని తెలిపారు. వంశీ మోహన్‌ను చలపతి విద్యాసంస్థల చైర్మన్ వైవీ ఆంజనేయులు, కళాశాల సెక టరి అండ్ కరస్పాండెంట్ వై సుజిత్‌కుమార్, ఈసీఈ విభాగాధిపతి అభినందించారు.

రేషన్ దుకాణాలపై విజిలెన్స్ అధికారుల దాడి

పెదనందిపాడు, జూలై 10(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొప్పర్రు రేషన్ షాపు నెం.1 పై గురువారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మెరుపు దాడులు నిర్వహించారు. షాపును, రికార్డులు పరిశీలించగా 18 క్వింటాళ్ల అదనపు రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు. డీలర్ పై 6ఏ కేసు నమోదు చేసి షాపును రెండో నెంబరు దుకాణానికి స్టాకును అప్పగించారు.

వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్‌ల నియామకం

పెదనందిపాడు, జూలై 10(ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు వ్యవసాయ మార్కెట్ యార్డుకు మండల పరిధిలోని కూటమి నాయకులకు డైరెక్టర్ పదవులు వరించాయి. పెదనందిపాడుకు చెందిన చాగంటి సత్యహర్ష, పాలపర్రుకు చెందిన బండ్లమూడి ఉపేంద్రరావు, రావిపాడుకు చెందిన ఆకుల భాగ్యలక్ష్మీకి డైరెక్టర్ పదవులకు నియామితులయ్యారు. కూటమి అధికారంలోకి రావడంతో పార్టీకి వెన్నుదన్నుగా నిలిచిన నాయకులకు, సముచిత స్థానం లభించడంతో హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి.

ఓటర్లకు ఓటు హక్కు ప్రాధాన్యం తెలియజేయాలి : తహసీల్దార్

పెదనందిపాడు, జూలై 10(ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఓటు హక్కు ప్రాధాన్యం తెలియజేయాలని తహసీల్దార్ హేనాప్రియ అన్నారు. స్థానిక పీఏఎస్ కళాశాలలో బూత్ లెవల్ అధికారులకు గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటు హక్కు ఎంతో కీలకమన్నారు. అర్హులైన వారికి ఓటు నమోదు చేసుకునే విధంగా చూడాలని తెలిపారు. అనంతరం బూత్ స్థాయి అధికారులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో డీటీ కరీముల్లా, ఆర్ఐ, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

తాడేపల్లి టౌన్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి పరిధిలో నులకపేట వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలయ్యాయి. ఎస్ఐ ప్రతాప్ తెలిపిన వివారాల ప్రకారం.. విజయవాడ నుంచి మంగళగిరివైపు వెళుతున్న ఓ గుర్తు తెలియని కారు అతివేగంగా వచ్చి రెండు ద్విచక్ర వాహనాలను ఢీకొంది. ఈ ఘటనలో నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. వారిలో మండలంలోని ఇప్పటం గ్రామ వీఆర్‌వో జయంతికి గాయాలయ్యాయని ఎస్ఐ ప్రతాప్ తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

శాకాంబరిగా పార్వతీ అమ్మవారు

తాడికొండ, జూలై 10(ఆంధ్రజ్యోతి): తాడికొండ శివారు బడేపురం కొండపై ఉన్న గంగా పార్వతి సమేత ఓంకారేశ్వర స్వామి దేవస్థానంలోని గంగా పార్వతి అమ్మవారికి మహిళలు సామూహికంగా ఆషాడ సారెను గురువారం సమర్పించారు. గంగా పార్వతి అమ్మవారిని పలు రకాల కూరగాయలు, పండ్లతో అలంకరించారు. మహిళలు సామూహికంగా కుంకుమార్చనల చేశారు. ఆలయ అర్చకులు విశేష పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

తల్లిదండ్రులు, గురువులు, దాతలను ఆరాధించండి

- ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్
- దాత రమేష్ సాయం అభినందనీయం
- 24 మంది విద్యార్థులకు 6లక్షలు స్కాలర్‌షిప్‌లు


దాత రమేష్ సమకూర్చిన స్కాలర్‌షిప్‌లను విద్యార్థులకు అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్

తుళ్లూరు(అనంతవరం), జూలై 10(ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు, గురువులు, దాతలను ఆరాధించండి.. బాగా చదువుకుని జ్ఞానాన్ని ఆర్జిస్తే మీ జీవితానికి మీరే హీరోలని ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ అన్నారు. మండలపరిధిలోని అనంతవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ (పీటీఎం) కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. తల్లికి వందనం కార్యక్రమంలో విద్యార్థులు తల్లులకు పూలతో పాదాభివందనం చేశారు. తమ పిల్లలను తల్లులు ఆశ్వీర్వదించారు. 24 మంది పేద విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.25 వేలు చొప్పున స్కాలర్ షిప్‌లను దాత మద్దినేని రమేష్ సమకూర్చారు. వాటిని విద్యార్థులకు ఎమ్మెల్యే చేతుల మీదగా అందజేశారు. విద్యార్థులకు మొక్కలను వాటితో పాటు గ్రీన్ కార్డు ఎమ్మెల్యే అందజేశారు. మధ్యాహ్న భోజన పథకం కోసం విద్యార్థులకు స్టీల్ కంచాలను విద్యార్థులకు ఎమ్మెల్యే అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శిల్ప, ఎంఈవో రాజశేఖర్, గ్రామ పెద్దలు బండ్ల సూరిబాబు, గోరిజాల శ్రీనివాసరావు, మద్దినేని రాంబాబు, బుడ్డి సందీప్, ప్రధానోపాధ్యాయుడు బి. సత్యం, ఉపాధ్యాయులు వాణి కోటేశ్వరావు, విద్యార్థుల తల్లిదండ్రులు విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు. తుళ్లూరు జిల్లా పరిషత్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. మందడం జిల్లా పరిషత్ పాఠశాలలో మెగా తల్లిందండ్రులు ఉపాధ్యాయుల మీటింగ్ కార్యక్రమం నిర్వహించారు.

పారదర్శకంగా సంక్షేమ పథకాలు..

గత వైసీపీ అరాచక ప్రభుత్వానికి బుద్ధి చెపుతూ కూటమి ప్రభుత్వానికి ప్రజలు 161 సీట్లిచ్చి తిరుగులేని మెజార్టీ ఇచ్చారని, ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలో రాష్ట్రాన్ని తిరుగులేని అభివృద్ధి చేసి చూపుతామని టీడీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ అన్నారు. అనంతవరం గ్రామంలో గురువారం కూటమి నేతలతో కలసి ఎమ్మెల్యే సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికెళ్లి సంవత్సరంలో అభివృద్ధి చేసిన పనులు, అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించిన కరపత్రాలను ఎమ్మెల్యే అందజేశారు. ప్రజల వద్దకు పాలన కూటమి అమలు చేస్తుందన్నారు. ప్రజలకు జవాబుదారి తనంతో పని చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ధామినేని శ్రీనివాసరావు, పుట్టి రామచంద్రరావు, అనంతవరం గ్రామ టీడీపీ నాయకులు కొమ్మినేని నరసింహాస్వామి, నెల్లూరి అప్పారావు, బండ్ల సూరిబాబు, దనేకుల సుబ్బారావు, తలతోటి సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

వ్యర్థాలపై అవగాహన కల్పించాలి

- ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు
- స్వచ్ఛ రథాన్ని ప్రారంభించిన ప్రజా ప్రతినిధులు


స్వచ్ఛ రథాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, జడ్పీ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా

గుంటూరు(తూర్పు), జూలై 10(ఆంధ్రజ్యోతి): వ్యర్థాలపై అవగాహన కల్పించాలని అధికారులకు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు సూచించారు. రూరల్ మండలం, లాలుపురంలో వ్యర్థాలను తీసుకుని నిత్యావసర సరుకులను అందించేందుకు ఏర్పాటు చేసిన స్వచ్ఛ రథాన్ని జడ్పీ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినాతో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం బూర్ల రామాంజనేయులు మాట్లాడుతూ కీలకమైన కార్యక్రమానికి పైలట్ ప్రాజెక్ట్‌గా రూరల్ మండలాన్ని ఎంపిక చేయడం సంతోషంగా ఉందన్నారు. స్వచ్ఛాంధ్ర స్ఫూర్తిని ప్రజల్లోకి తీసుకువచ్చేందుకు ఈ కార్యక్రమాన్ని రూపొందించినట్టు చెప్పారు. మండల పరిధిలోని గ్రామాల్లో ఈ రథం వస్తుందని ప్రజల నుంచి ప్లాస్టిక్ సీసాలు, ప్యాకెట్లు, పనికిరాని వస్తువులు, ఎలక్ట్రానిక్, ఇతర వ్యర్థాలను సేకరిస్తుందని తెలిపారు. వాటికి బదులుగా నిత్యావసర వస్తువులు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో జ్యోతిబసు, డీపీవో నాగసాయికుమార్, సీఆర్‌డీఏ అసిస్టెంట్ డైరెక్టర్ చందన, ఎంపీడీవో బండి శ్రీనివాసరావు, డిప్యూటి ఎంపీడీవో శ్రీనివాసరావు, మండల సిబ్బంది పాల్గొన్నారు.

సంపూర్ణ అక్షరాస్యతే కూటమి లక్ష్యం

సంపూర్ణ అక్షరాస్యతే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే రామాంజనేయులు అన్నారు. స్థానిక అడవి తక్కెళ్లపాడులోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకులం పాఠశాలలో జరిగిన తల్లి దండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం లో ఆయన పాల్గొని ప్రసంగించారు. కార్పొరేట్ విద్యకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో డిజిటల్ తరగతులను ప్రవేశపెట్టామని అన్నారు. విద్యార్థుల మేధస్సుకు పేదరికం అడ్డు రాకూడదనే ఈ కార్యక్ర మాలను చేపడుతున్నట్టు చెప్పారు. ప్రభుత్వం అందజేస్తున్న సౌకర్యాలు సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. సౌకర్యాలు లేని సమయంలో కష్టపడి చదవి కలెక్టర్ స్థాయికి ఎదిగానని గుర్తుచేసుకున్నారు. మీరు కూ డా అదే స్థాయిలో కష్టపడి చదివి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. పాఠశాలల అభివృద్ధికి రూపొందించిన ప్రణాళికలను ముందుకు తీసుకువెళ్లాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, స్థానిక నాయకులపై ఉందని తెలిపారు. అనంతరం పాఠశాలలో ఉన్న సౌకర్యాలపై విద్యార్థుల నుంచి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు కొర్రపాటి నాగేశ్వరరావు, గింజుపల్లి వెంకటేశ్వరరావు, కల్లూరు శ్రీనివాసరావు, బుర్రి సురేష్, ఇమ్మడి లీలామల్లేశ్వ రరావు పంచుమర్తి శేషు, దావులూరి శ్రీనివాసరావు, బేతం సౌరీలు, నాగరాజు, కార్పొరేటర్ బొడ్డుపల్లి స్మిత పద్మజ తల్లిదండ్రులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సీఆర్డీఏ ఆధ్వర్యంలో తొలిరోజు 200 మందికి వైద్యసేవలు

- ఉచిత క్యాన్సర్ వైద్యశిబిరాన్ని సందర్శించిన ఎమ్మెల్యే
- ముందస్తుగా గుర్తిస్తే పూర్తిగా నయం- సీఈవో కృష్ణ


వైద్య సేవలందిస్తున్న బసవతారకం వైద్యులు

తుళ్లూరు, జూలై 10(ఆంధ్రజ్యోతి): ప్రజా రాజధాని అమరావతిలో బసవతాకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆస్పత్రి రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ వారి సౌజన్యంతో ఏపీ సీఆర్డీఏ ఆధ్వర్యంలో తుళ్లూరులోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో క్యాన్సర్ వ్యాధిపై అవగాహన, ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరం గురువారం జరిగింది. 200 మంది ఈ శిబిరానికి హాజరు కాగా బసవతారకం ఆస్పత్రి వైద్యసిబ్బంది ఉచితంగా వారికి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ హాజరయ్యారు. త్వరలోనే అమరావతితో అత్యాధునిక సదుపాయాలతో ఏర్పాటు కానున్న బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి ఇక్కడ సేవలందించనుందని ఆయన అన్నారు. ఇప్పటికే నిర్మాణ పనులు మొదలు పెట్టారని తెలిపారు. శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు యర్రబాలెంలోని అర్బన్ హెల్త్ సెంటర్లో ఈ వైద్యశిబిరాన్ని నిర్వహిస్తామని, స్థానికులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. బసవతాకరం ఆస్పత్రి సీఈవో డాక్టర్ కూరపాటి కృష్ణయ్య మాట్లాడుతూ అమరావతిలోని సీఆర్డీఏ సౌజన్యంతో ఉచితంగా అవగాహన శిబిరాలు ఏర్పాటు చేశామన్నారు. క్యాన్సర్ వ్యాధిపై ప్రజల్లో ఉన్న భయా న్ని పోగొట్టేందుకు రాజధాని అమరావతిలో శిబిరాలు ఏర్పాటు చేసి సేవలందిస్తున్నామన్నారు. ముందుగా క్యాన్సర్‌ను గుర్తిస్తే తక్కువ ఖర్చుతోనే నయం చేయవచ్చన్నారు. వైద్యశిబిరంలో బసవతారకం ఆస్పత్రి సీవోవో సునీల్ టాండన్, వైద్యబృందం హెచ్‌వోడీలు హరికృష్ణ, సంతోష్, కృష్ణప్రసాద్, వైద్యులు శ్రవణకుమారి, సులోచన రవి శంకరు, అబ్దుల్ స్రిమాన్‌లతో కలసి నర్సులు ల్యాబ్ టెక్నిషియన్ సిబ్బంది సేవలదించారు. సీఆర్డీఏ సిబ్బంది, మండల వైద్యాధికారి శ్రీనివాసరావు సహకరించారు.

భక్తి శ్రద్ధలతో గురుపౌర్ణమి


ప్రత్యేక అలంకరణలో సాయిబాబా

గుంటూరు (తూర్పు), జూలై 10 (ఆంధ్రజ్యోతి): గుంటూరు రూరల్ మండలం, వెంగళాయపాలెం గ్రామంలో శ్రీఅభయసిద్ధి సాయిరామ సేవా మందిరంలో గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. సాయినాథుడికి పంచామృతాలతో అభి షేకం, అలంకార పూజ, అర్చన తదితర కార్యక్రమాలను వేద పండితులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయాల్లో భక్తులచే గురు చరిత్ర పారాయణం, సాయినాథుని సంకీర్తన చేశారు. భక్తులు, ప్రజా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో సాయిబాబాని దర్శించుకుని తీర్థ, ప్రసాదాలు స్వీకరించారు.

పండుగలా మెగా పేరెంట్ డే వేడుకలు

- కోలాహలంగా పాఠశాలలు
- తల్లిదండ్రులతో మమేకమైన ఉపాధ్యాయులు

ప్రత్తిపాడు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో కోలాహలం కనిపించింది. ఒక పక్క చిన్నారుల కేరింతలు, మరో పక్క వారి తల్లి దండ్రుల ఆనందం కలిసి పండుగలా మెగా పేరెంట్స్ డే వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా పాఠశాలల్లో చిన్నారులు తల్లిదండ్రులు కలిసి ముగ్గులు వేశారు. ఆటలు ఆడారు.. పాటలు పాడారు.. మొక్కలు నాటారు.. కలిసి బోజనం చేశారు.. వెరసి పాఠశాల ప్రాంగణాలు ఆహ్లాదకరంగా మారాయి. ప్రభుత్వ పాఠశాలల్లో చదివితే మా పిల్లల భవిష్యత్తుకు ఉజ్వల బాటలు పడతాయని, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో చక్కని విద్యను అందిస్తారనే నమ్మకాన్ని పెంచే విధంగా ఉపాధ్యాయులు వారికి అన్ని విషయాలను కూలంకషంగా వివరించారు. పలు పాఠశాలల్లో జరిగిన కార్యక్రమాలలో ఎంపీడీవో శివ పార్వతి, ఎంఈవో రమాదేవి, టీడీపీ మండల అధ్యక్షుడు గింజుపల్లి శివరామప్రసాద్, జీడీసీసీబీ మాజీ వైస్ చైర్మన్ కుర్రి సుబ్బారెడ్డి, తిక్కిరెడ్డిపాలెం సర్పంచ్ మాకినేని జగన్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

● వట్టిచెరుకూరు,(ఆంధ్రజ్యోతి): మండలంలోని లేమల్లెపాడు గ్రామంలోని ఎంపీయూపీ పాఠశాలలో మెగా పేరెంట్స్ టీచర్స్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. దాతల దాతృత్వంతో పాఠశాలలు అన్ని వసతులకు కృషి చేసిన అధ్యాపకులు, అదే స్ఫూర్తితో విద్యార్థులను భావి పౌరులుగా తీర్చిదిద్దాలని ఎంపీడీవో రమేష్‌బాబు ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రవాసాంధ్రులు చుండూరు వెంకట సత్యనారాయణ, రైల్వే ఆడిట్ అధికారి బీవీ సుధాకర్ బాబులు ప్రతిభావంతులైన విద్యార్థులకు సమకూర్చిన రూ.50వేలు విలువైన ఉపకార వేతనాలను ఎంపీడీవో రమేష్‌బాబు అందజేశారు.

● కాకుమాను(రేటూరు): విద్యార్థి ప్రత్యక్ష అభివృద్ధికి ఉపాధ్యాయులు కృషి చేస్తే, పరోక్షంగా తల్లిదండ్రులే కీలకమని ఎంఈవో కెన్నడీ అన్నారు. మండల వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో గురువారం మెగా పేరెంట్స్ మీటింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చుండూరు రాంబాబు, సబురాబీ, ఉపాధ్యాయులు వీరయ్య చౌదరి, రసూల్, సద్గుణరావు, ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

● పెదనందిపాడు,(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలలో గురువారం ఘనంగా మెగా పెరెంట్స్, టీచర్స్ సమావేశం నిర్వహించారు. విద్యార్థులు తల్లిదండ్రులతో కలసి ఉల్లాసంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

● స్థానిక పీఏఎస్ కళాశాలలో తల్లిదండ్రులు, విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి కళాశాల పాలకవర్గ సభ్యులు కాళహస్తి సత్యనారాయణ, నర్రా బాలకృష్ణ, సీతారత్తమ్మ, ప్రవాసాంధ్రుడు శాఖమూరి సత్యకృష్ణ, శిరీష, ఎంఈవో లు ముద్దన శ్రీనివాసరావు, జాకబ్, ఉపాధ్యాయులు, ఎస్ఎంసీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ

తాడేపల్లి (గుండిమెడ), జూలై 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న మెగా పీటీఎం 2.0 కార్యక్రమంలో భాగంగా తాడేపల్లి మండలం గుండిమెడలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న 50 మంది విద్యార్థులకు టీడీపీ మండల మాజీ అధ్యక్షులు కొమ్మారెడ్డి కిరణ్, అనుమోలు ఆంజనేయులు, గురువారం నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు చిగురుపాటి సుబ్బా రావు, నామతోటి రాంబాబు, టీచర్లు, గ్రామస్థులు, స్థానికులు పాల్గొన్నారు.

కుంచనపల్లి గ్రామంలో ఎంపీయూపి స్కూల్లో 100 మంది విద్యార్థులకు గురువారం నోటు పుస్తకాలు పెన్నులు అందజేశారు. ఉండవల్లిలోని గాదె రామయ్య సీతారావమ్మ జడ్పీ హైస్కూల్లో జరిగిన పీటీఎం సందర్భంగా టీడీపీ నాయకులు జొన్నా శ్రీనివాసరావు విద్యార్థిని విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు అందజేశారు.

విజయకీలాద్రిపై గురు పూర్ణిమ


చినజీయర్ స్వామి చిత్రపటానికి గురుపూజ చేస్తున్న వెంకటాచార్యులు, శిష్య బృందం

తాడేపల్లి టౌన్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): వేద విశ్వ విద్యాలయ వ్యవస్థాపకులు త్రిదండి చినజీయర్ స్వామి మంగళ శాసన ములతో గురువారం సీతానగరం విజయకీలాద్రి దివ్యక్షేత్రంలో గురు పౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. తొలుత రామానుజ పెద జీయర్ స్వామికి (తిరుమంజనం) అభిషేకం నిర్వహించారు. అనంతరం చినజీయర్ స్వామి ఆశ్రమం నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు ఆధ్వర్యంలో లక్ష్మీ హయగ్రీవ హోమం, ఆచార్య పాదుకారాధన, మంగళశాసనము, అష్టోత్తర శతనామార్చన, తీర్థ ప్రసాద గోష్టి కార్యక్రమాలు జరిగాయి. అర్చకులు శ్రీనివాసాచార్యులు, అనంత స్వామి, వేద విద్యార్థులు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సాయిబాబా మందిరంలో ప్రత్యేక పూజలు

మంగళగిరి, జూలై 10 (ఆంధ్రజ్యోతి): పెదవడ్లపూడి గ్రామంలోని భగవాన్ శ్రీసత్య షిరిడీ సాయిబాబా మందిరంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాబాకి పంచామృతాభిషేకం, అన్నాభిషేకం, విశేష పూజలు చేశారు. అనంతరం వెయ్యి మంది భక్తులకు పైగా అన్న సంతర్పణ గావించారు. హౌసింగ్ పీడీ జేవీఎస్‌ఆర్‌కేవీ ప్రసాద్, ఆప్కో మాజీ చైర్మన్ గంజి చిరంజీవి, యు బ్లడ్ సంస్థ ప్రతినిధి యలమంచిలి రమేష్ తదితర ప్రముఖులు సాయిబాబాను దర్శించుకున్నారు.

● దుగ్గిరాల, జూలై 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో గురు పూర్తి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పలు సాయిబాబా ఆలయాలు, షిర్డిసాయి మందిరాల్లో గురుపూర్ణిమ సందర్భంగా సాయినాధునికి పలు రకాల అభిషేకాలు చేశారు. భక్తులకు మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

● పెదనందిపాడు, జూలై 10: మండల పరిధిలోని ఆయా దేవాలయాల్లో గురుపూజోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సాయి మందిరంలో కమిటీ ఆధ్వర్యంలో సాయి బాబా మూల విరాట్‌కు మహాన్యాసపూర్వక ఏకాదశి రుద్రాభిషేకం వివిధ పూజలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం గ్రామస్థులు, దాతల సహకారంతో అన్నదానం కార్యక్రమం జరిగింది.

● కాకుమాను, జూలై 10(ఆంధ్రజ్యోతి): కాకుమానులో చెన్న కేశవస్వామి ఆలయంలో కొలువైఉన్న సాయిబాబాకి పల్లకి సేవ జరిగింది. భక్తులు పల్లకిని గ్రామ వీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

● వట్టిచెరుకూరు, జూలై 10(ఆంధ్రజ్యోతి) : మండలంలోని లేమల్లెపాడు, చింతపల్లిపాడు గ్రామాల్లోని సాయినాధుని ఆలయాల్లో గురుపౌర్ణమి వేడుక లను ఘనంగా నిర్వహించుకున్నారు. భక్తులు సాయినాధుని విగ్రహాలకు అభిషేకాలు నిర్వహించారు.

విద్యాభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి

- ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ

మంగళగిరి సిటీ, జూలై 10 (ఆంధ్రజ్యోతి): విద్యారంగం అభివృద్ధికి కూటమి ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తుందని ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ అన్నారు. పట్టణంలోని వీవర్స్‌కాలనీ ఎంటీఎంసీ హైస్కూల్లో గురువారం మెగా పేరెంట్స్-టీచర్స్ మీటింగ్ జరిగింది. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను సత్కరించి అభినందించారు. ఎమ్మెల్సీ అనురాధ మాట్లాడుతూ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ విద్యారంగంలో అనేక మార్పులకు శ్రీకారం చుట్టారని తెలిపారు. పిల్లల బంగారు భవిష్యత్తు కోసం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పాఠశాల్లోనూ మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ 2.0 నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ప్రతి విద్యార్థి తల్లిదండ్రులు పాఠశాలకు వచ్చి పిల్లల చదువు, క్రమశిక్షణ గురించి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు చిన్నారులపై ప్రత్యేక దృష్టి సారించి పిల్లల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా 45,094 పాఠశాలల్లో మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశాలను ప్రభుత్వం పెద్ద ఎత్తున నిర్వహిస్తుందని తెలిపారు. టీడీపీ గుంటూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ టీచర్స్ పేరెంట్స్ మధ్య అవగాహన పెంపొందించేందుకు ఈ సమావేశాలు దోహదం చేస్తాయన్నారు. కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి, ఎంటీఎంసీ అడిషనల్ కమిషనర్ కే శకుంతల, నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ మున్నంగి శివశేషగిరిరావు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు పడవల మహేష్, ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, వంగర హనుమాన్, పాఠశాల వైస్‌చైర్మన్ బిట్రా చెన్నకేశ్వరి, వంగర పెదలక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు. ఎర్రబాలెంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 150 మంది విద్యార్థులకు నాయుడు శ్రీనివాసరావు (జాక్సన్) సహకారంతో నోటుపుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు అందజేశారు. పెదవడ్లపూడిలో జరిగిన కార్యక్రమంలో మంగళగిరి మార్కెట్ కమిటీ చైర్మన్ జవ్వాది కిరణ్‌చంద్, హౌసింగ్ పీడీ జీవీఎస్‌ఆర్ ప్రసాద్, ఎంపీడీవో సుగుణమ్మ, టీడీపీ గ్రామ అధ్యక్షుడు యేళ్ల శివరామయ్య, నేతలు మాదల రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు. చినకాకానిలో విద్యార్థులకు ప్రభుత్వం అందజేసిన నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పల్లబోతుల శ్రీనివాసరావు, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి గాదె పిచ్చిరెడ్డి, పాఠశాల హెచ్‌ఎం రామారావు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ బుల్లా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. శ్రీ సీతారామచంద్ర పరిపూర్ణ బోధోపదేశం గురుపీఠం చైర్మన్ ఎం.శ్రీనివాసరావు మంగళగిరి జీఆర్ స్కూల్ విద్యార్థులకు నోటుపుస్తకాలను అందజేశారు.

కూటమి పాలనలో అభివృద్ధి పరుగులు


మంగళగిరి 14వ వార్డులో కరపత్రాలు పంచుతున్న ఎమ్మెల్సీ అనురాధ, టీడీపీ నాయకులు

మంగళగిరి, జూలై 10 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం అభివృద్ధిని పూర్తిగా పక్కన పెట్టేస్తే.. కూటమి సర్కారు అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే అభివృద్ధిని పరుగులు పెట్టిస్తుందని ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ అన్నారు. మంగళగిరి పట్టణంలోని 14వ వార్డులో గురువారం జొన్నాదుల బాలకృష్ణ ఆధ్వర్యాన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. నేతలు ఇంటింటికీ వెళ్లి ఏడాదిలో ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించి కరపత్రాలను పంపిణీ చేశారు. మంగళగిరి నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు మంత్రి నారా లోకేశ్ కంకణబద్ధులై పనిచేస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాండ్రు శ్రీనివాసరావు, టీటీడీ బోర్డు సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి, గుంటూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, పద్మశాలి సాధికార సమితి సభ్యుడు జొన్నాదుల బాలకృష్ణ, టీడీపీ పట్టణ అధ్యక్షుడు పడవల మహేష్, ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, బీసీ సెల్ పట్టణ అధ్యక్షుడు వాకా మాధవరావు, తెలుగు మహిళ రాష్ట్ర కార్యదర్శి వింజమూరి ఆశాబాల, నేతలు కొల్లి వేణుబాబు, వెనిగళ్ల భద్రయ్య, ఆకురాతి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌కే తండా భూ బాధితులకు న్యాయం చేయాలి

- రాష్ట్ర ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు వడిత్యా శంకర్‌నాయక్

తాడేపల్లి టౌన్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా గడివేముల మండలం ఎల్‌కే తండాలో భూములు కోల్పోయిన రైతులకు న్యాయం చేయాలని రాష్ట్ర మాజీ ఎస్టీ కమిషన్ సభ్యులు, గిరిజన ప్రజా సమాఖ్య వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు వడిత్యా శంకర్ నాయక్ డిమాండ్ చేశారు. బాధిత రైతులు, గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాజునాయక్‌తో కలిసి గురువారం తాడేపల్లిలోని గ్రీన్‌కో ఎనర్జీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. అనంతరం ఎండీ కమలాకర్‌బాబును కలిసి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర యువజన అధ్యక్షుడు హనుమంతునాయక్, రైతులు బద్దూ నాయక్, సామే నాయక్, జీవుల నాయక్, హీమీబాయి, స్వామినాయక్, సీతమ్మబాయి తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

తాడికొండ, జూలై 10(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయని టీడీపీ సీనియర్ నాయకులు, సొసైటీ మాజీ అధ్యక్షుడు ఎడ్వూరి హనుమంతరావు తెలిపారు. గురువారం ప్రభుత్వ పాఠశాలల్లో మెగా పేరెంట్స్ మీటింగ్‌ను నిర్వహించారు. తాడికొండ ఎస్సీకాలనీలోని జిల్లా పరిషత్ పాఠశాల, ఏపీ గురుకుల, అంబేద్కర్ గురుకుల పాఠశాల, బీఎస్ఎస్‌బీ కళాశాల, లాం పాటిబండ్ల సీతారామయ్య ఉన్నత పాఠశాలల్లో మెగా పేరెంట్స్ మీటింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎడ్వూరి హనుమంతరావు హాజరయ్యారు. పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ తోకల సరోజిని, ఇన్‌చార్జి హెచ్‌ఎం సువిశారద, విద్యా కమిటీ చైర్మన్ సాంబశివరావు, ఎంపీటీసీ నూతక్కి ప్రమీల, లాం సర్పంచ్ అబిదాఅలీ, పంచాయతీ కార్యదర్శి అరుణ్‌కుమార్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సేవలు ఎనలేనివి

మేడికొండూరు జూలై 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల కృషి అభినందనీయమని మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు పాములపాటి శ్రీనివాస్ తెలిపారు. మేడికొండూరు మండలంలోని పేరేచర్ల జడ్పీ హైస్కూలు, లక్ష్మినరసింహా కాలనీలోని జడ్పీ హైస్కూల్లో గురువారం తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పేరేచర్ల సర్పంచ్ దేవరకొండ రాజ్‌కుమార్, మాజీ జడ్పీటీసీ సభ్యులు గుంటుపల్లి సాంబశివరావు, పాములపాటి శివన్నారాయణ తదితరులతో పాటు ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బాలలను పర్యావరణ పరిరక్షణ రక్షకులుగా చేయాలి

ఫిరంగిపురం, జూలై 10 (ఆంధ్రజ్యోతి): బాలలు పర్యావరణ రక్షకులుగా తయారు కావాలని ఎంపీడీవో పీ శివసుబ్రహ్మణ్యం అన్నారు. గురువారం ఫిరంగిపురంలోని అల్లంవారిపాలెం జడ్పీ హైస్కూల్లో జరిగిన బడి పండుగలో ఆయన మాట్లాడారు. మొక్కలు నాటడం, వాటిని సంరక్షించటం బాలలకు నేర్పాలన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విద్యాభివృద్ధిలో సమస్యల గురించి చర్చించుకొని పరిష్కరించుకోవాలన్నారు. ఆరోగ్యనగర్ స్కూల్లో ఎస్టీయూ మండల అధ్యక్షుడు పాలడుగు ప్రసాదు బడి పండుగలో పాల్గొన్నారు. అలాగే ఆర్‌సీజేసీ కళాశాలలో సీఐ, ప్రిన్సిపాల్ సుదర్శన్, ఎంఈవోలు పాల్గొన్నారు.

నాణ్యమైన పశుగ్రాసాలతో పాల దిగుబడి పెంపు

- జిల్లా పశు సంవర్ధక శాఖ ఏడీఏ కేవీవీ సత్యనారాయణ

ఫిరంగిపురం, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : నాణ్యమైన పశు గ్రాసాలతో పాల దిగుబడి పెంపుదల జరుగుతుందని జిల్లా పశు సంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు కేవీవీ సత్యనారాయణ అన్నారు. గురువారం మండలంలోని తక్కెళ్ళపాడులో పశు గ్రాస వారోత్సవాల్లో పాల్గొన్న ఆయన మాట్లాడారు. పశుగ్రాసం సాగు చేస్తున్న రైతులకు ఆయన పలు సూచనలు చేశారు. పశు గ్రామ ప్రాముఖ్యం, పశుగ్రాస రకాలు, పాల దిగుబడి పెంపు, ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, రాయితీల గురించి వివరించారు. కార్యక్రమంలో ఐఎస్‌డీటీ అసిస్టెంట్ డైరెక్టర్ టీ మోహన్‌రావు, పశు వైద్యాధికారి సాల్మన్ సింగ్, సిబ్బంది పాల్గొన్నారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

చోరీపై కేసు నమోదు

తెనాలి, మారీసుపేట, జూలై 10 (ఆంధ్రజ్యోతి): తాళంవేసిన ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన ఘటనపై అందిన ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం స్థానిక రామలింగేశ్వరపేటకు చెందిన ఎం.ఫణిప్రసాద్ తన ఇంటికి తాళం వేసి గత నెల జూన్ 29న పనుల నిమిత్తం వేరే ప్రాంతానికి వెళ్లాడు. గురువారం సమీప బంధువు ఇంటికి వచ్చిచూడగా తాళాలు పగులగొట్టి ఉండటాన్ని గుర్తించి ఫణిప్రసాద్‌కు తెలిపాడు. తెనాలి వచ్చి ఇంటిని పరిశీలించి రూ.20వేలు నగదు అపహరణకు గురైనట్లు గుర్తించాడు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అసంపూర్తిగా గుంటూరు చానల్ మరమ్మతు పనులు

● సీపీఎం మండల కార్యదర్శి శివాజీ

పెదకాకాని, జూలై 10 (ఆంధ్రజ్యోతి): నిత్యం కొన్ని లక్షల మందికి తాగునీరు పొలాలకు సాగునీరు అందించే గుంటూరు చానల్‌లో గుర్రపు డెక్క తొలగింపు, కాలువ గట్ల మరమ్మతుల పనులు అసంపూర్తిగా జరుగుతున్నాయని సీపీఎం మండల కార్యదర్శి నన్నపనేని శివాజి ఆరోపించారు. గురువారం రైతులతో కలిసి గుంటూరు చానల్‌ను పరిశీలించిన శివాజీ మాట్లాడుతూ కాలువ కట్టలు అనేకచోట్ల కోతకు గురయ్యాయని, కాల్వ కట్టల మరమ్మతులు చేయాలని ప్రభుత్వం నిధులు మంజూరుచేస్తే నామమాత్రంగా పనులు చేస్తున్నారన్నారు. పెదకాకాని నుంచి గోళ్ళమూడి వెళ్లే రోడ్డు కాలువ లాకులు తుప్పుపట్టి నిర్వహణ సరిలేక శిథిలావస్థకు చేరాయని లాకులు మరమ్మతులు చేయాలన్నారు. కాలువ కట్టలపై జరుగుతున్న పనులను చూసి రైతులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం నాయకులు సంకూరి నీలాంబరం, రైతులు వి.వీరాంజనేయులు, డి.వినోద్ బా బు, డి.భవానిశంకర్, జి.నాగరాజు, ఎస్.గోపి, డి.సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యా వ్యవస్థను బలోపేతం చేస్తున్న మంత్రి లోకేశ్

● ప్రొఫెసర్ జోసెఫ్ మోసిగంటి

పొన్నూరు టౌన్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): మంత్రి లోకేశ్ విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేస్తున్నారని జీసస్ బిలీవర్స్ అసోసియేషన్ కౌన్సిల్ చైర్మన్ ప్రొఫెసర్ జోసెఫ్ మోసిగంటి గురువారం అన్నారు. మెగా పేరెంట్, టీచర్ మీటింగ్ వల్ల 99 శాతం మంది తల్లిదండ్రులు సమావేశానికి హాజరై ఉపాధ్యాయులతో అనుసంధానం అవుతున్నారన్నారు. కార్యక్రమంలో విద్యార్థుల విద్యా ప్రమాణాల గురించి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో చర్చించి పిల్లల భవిష్యత్తుకు మార్గాలు అన్వేషించుకున్నారన్నారు. జగన్‌రెడ్డి ప్రభుత్వంలో అమ్మఒడి కుటుంబంలో ఒక్కరికి మాత్రమే ఇస్తే కూటమి ప్రభుత్వం తల్లికి వందనం పేరుతో పాఠశాలకు వెళ్లే ప్రతి చిన్నారికి ఆర్థిక సాయం అందజేయటంపై కొనియాడారు. అలాగే డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం, సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్స్ వంటి పథకాలను అమలు చేయడం స్ఫూర్తిదాయకమన్నారు.

ఫసల్ బీమా చేయించుకోండి

● మండల వ్యవసాయాధికారి సుధీర్‌బాబు

తెనాలిరూరల్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ పంటలు సాగుచేసే ప్రతి రైతు తప్పనిసరిగా ప్రధానమంత్రి ఫసల్‌బీమా పథకంలో ఇన్సూరెన్స్ చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి కె.సుధీర్‌బాబు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎకరా వరి పంటకు రూ.800, మినుము, పెసలు వంటి వాటికి రూ.200వంతున ఈ నెల 31లోగా దగ్గరలోని సీఎస్సీ సెంటర్ లేదా బ్యాంకులను సంప్రదించి ప్రీమియం చెల్లించాలని కోరారు. అనుకోని విధంగా ప్రకృతి విపత్తులు సంభవించి పంటలకు నష్టం జరిగితే బీమా సొమ్ము రైతులకు అండగా నిలుస్తుందన్నారు. ప్రతి రైతు తప్పనిసరిగా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

డీఎంగా వెంకటేశ్వరరావు బాధ్యతల స్వీకారం

పొన్నూరు టౌన్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు ఆర్టీసీ డిపో మేనేజర్‌గా ఎల్ వెంకటేశ్వరరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు డిపో మేనేజర్‌గా పని చేస్తున్న టి.అజితకుమారి బదిలీపై వెళ్లారు. నూతన మేనేజర్ వెంకటేశ్వరరావును డిపో సిబ్బంది కార్మిక సంఘాల నాయకులు కలిసి అభినందించారు.

విద్యతోనే బంగారు భవిష్యత్తు

పొన్నూరు టౌన్, చేబ్రోలు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): విద్యతోనే బంగారు భవిష్యత్తు అని చేబ్రోలు ప్రెసిడెన్సీ స్కూల్ ప్రిన్సిపాల్ వాసిరెడ్డి ఆశాలత అన్నారు. చేబ్రోలు ప్రెసిడెన్సీ స్కూల్‌లో గురువారం బంగారు భవిష్యత్తు బడివైపు ముందడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశమై విద్యార్థుల భవిష్యత్తు ప్రణాళికల గురించి చర్చించారు. విద్యా ప్రమాణాల గురించి వివరించి విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసే అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ వాసిరెడ్డి బస్‌బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాలల వద్ద గంజాయి అమ్మితే ఆస్తులు జప్తు

● పాఠశాలల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు ముందుకు రావాలి

● రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి మనోహర్

తెనాలి, జూలై 10 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల దగ్గర, చిన్నారులకు గంజాయి అమ్మినా ఎవరిని వదిలేది లేదని, వారిపై కఠిన చట్టాలు ప్రయోగించడమే కాకుండా వారి ఆస్తులను కూడా జప్తు చేయబోతున్నామని, దీనిపై మంత్రివర్గంలో కూడా నిర్ణయం తీసుకున్నట్లు రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్‌లో భాగంగా తెనాలిలోని రావి సాంబయ్య మున్సిపల్ బాలురోన్నత పాఠశాలలో గురువారం జరిగిన కార్యక్రమానికి మంత్రి హాజరయ్యారు. చిన్నారులతో కలిసి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజన సమయంలో పాఠశాల విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి మంత్రి మనోహర్, కలెక్టర్ నాగలక్ష్మిలు భోజనం చేశారు. సభలో మంత్రి మాట్లాడుతూ, రాష్ట్రంలో గంజాయిని కూకటివేళ్లతో సహా నిర్మూలించేందుకు కూటమి ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక గంజాయి అమ్మకాలపై ఉక్కుపాదం మోపిందన్నారు. మరో మూడు నెలల్లో గంజాయి జాడలు లేకుండా చేసేందుకు యత్నిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో పి-4 కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నామని, దీనిలో భాగంగా దాతలను గుర్తించి వారి సహకారంతో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టనున్నట్లు చెప్పారు. విద్యాశాఖాభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం రూ.36 వేల కోట్లు కేటాయించినట్లు మనోహర్ చెప్పారు. మహిళా కమిషన్ మాజీ చైర్ పర్సన్ నన్నపనేని రాజకుమారి మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి పరచడంతో పాటు చిన్నారులను చేర్పించి ప్రోత్సహించాల్సిన బాధ్యత కూడా అందరిపై ఉందన్నారు. జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు కల్పించడం ద్వారా డ్రాప్ అవుట్స్ లేకుండా చూస్తున్నామని, తల్లిదండ్రులు కూడా అర్హత కలిగిన ఉపాధ్యాయులు ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పించేందుకు ముందుకు రావాలన్నారు. ఈగల్ టీమ్ ఎస్పి నగేష్‌బాబు మాట్లాడుతూ ఎవరైనా పాఠశాలల వద్ద అమ్మేందుకు ప్రయత్నం చేస్తే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. దీనికి సంబంధించిన పోస్టర్లు మంత్రి ప్రారంభించారు. సమావేశంలో డీఈవో రేణుక, తెనాలి సబ్ కలెక్టర్ సంజన సింహ, మున్సిపల్ చైర్ పర్సన్ తాడిబోయిన రాధిక, డిప్యూటీ డీఈవో శాంతకుమారి, సమగ్ర శిక్షా అడిషనల్ ప్రాజెక్టు డైరెక్టర్ పద్మావతి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ శాంతి, మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ లక్ష్మీపతిరావు, తహసీల్దార్ కెవి గోపాలకృష్ణ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఈ సమావేశానికి ఎంఈవో లక్ష్మీనారాయణ అధ్యక్షత వహించారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర పౌర సరఫరాలశాఖ మంత్రి మనోహర్

● తెనాలి అర్బన్: పట్టణంలోని పాఠశాలల్లో గురువారం మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగులు ఘనంగా నిర్వహించారు. ఆయా పాఠశాలల్లో తల్లిదండ్రులకు విద్యార్థులు, ఉపాధ్యాయులు స్వాగత ఏర్పాట్లు చేశారు. తరగతి గదుల్లో విద్యార్థులతో కలిసి తల్లిదండ్రులను ఉపాధ్యాయులను అడిగి తమ పిల్లల ప్రగతిని ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. అనంతరం సమావేశాలు నిర్వహించి లక్ష్యాలను వివరించారు. తల్లిదండ్రులకు ఆటల పోటీలు జరిపి బహుమతులు అందజేశారు. జేఎంజే మహిళ కళాశాలలో సీఐ పీవీ ఆంజనేయులు, సైబర్ నేరాల గురించి వివరించారు. జేకేసీ కళాశాల హెచ్‌వోడీ నాగసుశీల, బాలథెరిసమ్మ, ప్రిన్సిపాల్ శాంత, రోజ్లి, అధ్యాపకులు పాల్గొన్నారు.



తల్లుల పాదాలకు నమస్కరిస్తున్న విద్యార్థులు

● తెనాలి రూరల్: మండల గ్రామాల్లోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో గురువారం మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ సందడిగా జరిగింది. మండలంలోని సంగంజాగర్లమూడి హైస్కూల్‌లో హెచ్‌ఎం శివరామకృష్ణ ఆధ్వర్యంలో, కొలకలూరు, అంగలకుదురు, పెదరావూరు హైస్కూల్స్‌లో, 18 గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలల్లో ఆరు నుంచి పదో తగతి వరకూ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేసి వారి తల్లిదండ్రులకు విద్యార్థులతో పాద పూజ చేయించారు.

● కొల్లిపర: తల్లిదండ్రులు తమ పిల్లలను ఎప్పుడూ గమనిస్తూ ఉండాలని తహసీల్దార్ సిద్ధార్థ అన్నారు. గురువారం మండల కేంద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సమావేశానికి ప్రధానోపాధ్యాయురాలు డాక్టర్ సౌజన్య అధ్యక్షత వహించారు. మండల కేంద్రం కొల్లిపర వివేక హైస్కూల్‌లో ప్రిన్సిపాల్ రాఘవరెడ్డి అధ్యక్షతన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశాన్ని ఘనంగా నిర్వహించారు. శ్రీకళానిలయ కార్యదర్శి బొమ్మారెడ్డి ప్రభాకర్‌రెడ్డి, సర్పంచ్ పిల్లి రాధిక, విశ్రాంత ఎంఈవో ఆరిమండ కుటుంబరెడ్డి, గ్రామ పెద్దలు కల్లం వీరారెడ్డి, నెర్ల కుటుంబరెడ్డి, భీమవరపు వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● తెనాలి, మారీసుపేట, జూలై 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యతో ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అన్నారు. గురువారం స్థానిక కొత్తపేటలోని దొడ్డపనేని ఇందిర పురపాలకోన్నత పాఠశాలలో మెగా పేరెంట్స్ మీటింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు తోటకూర రఘురామయ్య, ఉపాధ్యాయులు సంధ్యారాణి, పద్మ, శేషకుమారి, జ్యోతి, స్కూల్ అసిస్టెంట్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

● పొన్నూరు టౌన్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యాబోధన, సౌకర్యాలు ప్రభుత్వం కల్పిస్తున్నట్లు ఎంఈవో కొల్లి విజయభాస్కర్ తెలిపారు. పొన్నూరు మండలంలో పలు పాఠశాలల్లో గురువారం మెగాపేరెంట్ టీచర్స్ మీటింగ్ నిర్వహించారు. పొన్నూరు పురపాలక సంఘం పరిధిలోని జిల్లా పరిషత్ హైస్కూల్లో, ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన మెగా పేరెంట్ టీచర్ కార్యక్రమాలల్లో మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్‌బాబు పాల్గొన్నారు. చేబ్రోలు మండలంలోని చేబ్రోలు నారాకోడూరు, వేజెండ్ల తదితర గ్రామాల్లో పాఠశాలల్లో మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ జరిగింది. ఎంఈవో సుబ్బారావు ఆధ్వర్యంలో కార్యక్రమాలను నిర్వహించారు.

సందడిగా వివా 'పేరెంట్ టీచర్ మీటింగ్'

పెదకాకాని, జులై 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశానుసారం వివా ది స్కూల్‌లో నిర్వహించిన మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ సందడిగా గురువారం సాగింది. కార్యక్రమంలో పాల్గొన్న తల్లిదండ్రులకు చిన్నారులతో సరదాగా ఆడిపాడారు, అనంతరం ఉపాధ్యాయులు విద్యార్థుల ప్రగతి గురించి తెలియజేశారు. కార్యక్రమంలో విద్యార్థులు సృజనాత్మకత, ప్రతిభ మేళవింపుతో ప్రదర్శించిన కళలు, సాంస్కృతిక నృత్యాలు, గీతాలు తల్లిదండ్రులను అలరించాయి. విద్యార్థులు సెంటర్ స్టేజ్ వేదికపై సెయింటింగ్, డ్రామా, సంగీతం, సాంస్కృతిక, ఆధునిక నృత్యాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఎలి కమాండర్ కె.శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ చదలవాడ సరళ పీఫైపీ కోఆర్డినేటర్ ఏకే మాధవి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికి తాగునీరు అందించేందుకు కృషి

● ఏఎంసీ మాజీ చైర్మన్ మాదాల వెంకటేశ్వరరావు

పొన్నూరు టౌన్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ప్రతి గృహానికి కుళాయి ద్వారా తాగునీరు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఏఎంసీ మాజీ చైర్మన్ మాదాల వెంకటేశ్వరరావు అన్నారు. మండల పరిధిలోని జూపూడి, మన్నవ గ్రామాల్లో గురువారం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. రెండు గ్రామాలకు 700ఎకరాలకు పైగా సాగునీరు అందించే కొమ్మూరు చానల్ ద్వారా నీటిని విడుదల చేశారు. అలాగే ఎస్టీ కాలనీలో ఓవర్ హెడ్ ట్యాంక్ నుంచి ఎస్టీ కాలనీ, బీసీ కాలనీలకు జల జీవన్ మిషన్ ద్వారా 600 మీటర్ల పైప్‌లైన్ నిర్మాణంకోసం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలకు అవసరమైన అభివృద్ధి సంక్షేమాన్ని కూటమి ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో సాగునీటి సంఘం డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ గనిపిశెట్టి రామకృష్ణ కల్లూరి కోటేశ్వరరావు, కంచర్ల రత్నమోహన్, ముద్రబోయిన చంద్రశేఖర్, నాలం ఈశ్వరచంద్రప్రసాద్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న బాలస్వామి, భక్తులు

అర్ధ చతుర్మాసవ్రత దీక్ష మహోత్సవాలు ప్రారంభం

తెనాలి, మారీసుపేట, జూలై 10 (ఆంధ్రజ్యోతి): భక్తులు అర్ధ చతుర్మాస వ్రత దీక్ష మహోత్సవాలను భక్తిశ్రద్ధలతో ప్రారంభించారు. గురువారం స్థానిక గంగానమ్మపేటలోని ది తెనాలి కమీషన్ మర్చంట్స్ అసోసియేషన్ బిల్డింగ్‌లో శ్రీవిద్యాపీఠం, శ్రీసాలిగ్రామ ట్రస్ట్ ఆధ్వర్యంలో పెనుగొండ పీఠాధిపతి శ్రీప్రజ్ఞానంద సరస్వతి (బాలస్వామి) స్వయం పర్యవేక్షణలో అర్ధ చతుర్మాస్య వ్రత దీక్ష మహోత్సవాలను వైభవంగా ప్రారంభించారు. గురుపౌర్ణమి సందర్భంగా స్వామివారికి సుప్రభాత సేవ, అష్టోతరం, దివ్య దేశాల స్వరూప 108 సాలిగ్రామాలకు తిరుమంజనం తులసి అర్చన, చంద్రమౌళీశ్వర స్వామివారి ఆరాధనను నిర్వ హించారు. ఈ సందర్భంగా బాలస్వామి ప్రవచనం చేస్తూ నేటి నుంచి సెప్టెంబరు 7 తేదీ వరకు ప్రత్యేక పూజలు, అభిషేకాలను నిర్వహిస్తామని, భక్తులతో 60రోజులు హనుమాన్ చాలీసా పారాయణం కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ నంబూరు వెంకట కృష్ణమూర్తి, సెక్రటరీ రావూరి సుబ్బారావు, జాయింట్ సెక్రటరీ ముద్దాభక్తుని రమణయ్య, సలహా మండలి చైర్మన్ కొత్త సుబ్రహ్మణ్యం, గడ్డిపాటి శ్రీనివాసరావు, గోపు రామకృష్ణ, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబ సభ్యులకు రూ.2లక్షల బీమా అందజేత

కొల్లిపర, జూలై 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం కొల్లిపరలో గత కొద్ది రోజులు క్రితం పోకూరి జోజిబాబు క్యాన్సర్ వ్యాధితో మృతిచెందాడు. జోజిబాబుకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ఖాతా ఉండటంతో పాటు ప్రధాన మంత్రి జీవనజ్యోతి బీమా ఉండటంతో గురువారం కొల్లిపర స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచి మేనేజర్ అన్నపరెడ్డి రమేష్ రూ.2లక్షల చెక్కును కుటుంబ సభ్యులకు అందజేశారు.



జోజిబాబు కుటుంబ సభ్యులకు చెక్కును అందజేస్తున్న స్టేట్ బ్యాంక్ మేనేజర్ అన్నపరెడ్డి రమేష్

వివిధ రంగాల ప్రముఖులకు బీజేపీ సన్మానం

తెనాలి అర్బన్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): వివిధ రంగాల్లో ప్రముఖ పాత్ర పోషించిన పలువురిని బీజేపీ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సన్మానించారు. పార్టీ పిలుపుమేరకు వారి గృహాలను సందర్శించి వారి యోగక్షేమాలను విచారించి సత్కార కార్యక్రమం నిర్వహించారు. ప్రముఖ వైద్యులు పాటిబండ్ల దక్షిణామూర్తి, శిల్పి కాటూరి వెంకటేశ్వరరావు, విశ్రాంత ఉపాధ్యాయులు వేజండ్ల ఉమామహేశ్వరరావు, అయినాల మల్లేశ్వరరావు, మాజీ సైనికులు తాతా పోతురాజులను సన్మానించారు. పార్టీ నాయకులు వాసుదేవనాయుడు, నందకిషోర్, సందీప్, రవీంద్ర, అనంతాచార్యులు, హరికృష్ణ, సంపత్ రాయుడు, యోగానందకిషోర్, సుధాకర్, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.



శిల్పి కాటూరిని సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

దశావతార వెంకన్న సన్నిధిలో అభిషేక పూజలు

పెదకాకాని, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదుట ఉన్న దశావతార వెంకన్న సన్నిధిలో అభిషేక పూజలను గురువారం నిర్వహించారు. ఆషాడమాసం సందర్భంగా ఐజేఎం (రైన్ ట్రీ పార్క్) లింగమనేని టౌన్ షిప్ ఫేస్-1 నివాసితులు శ్రీదశావతార వేంకటేశ్వరస్వామి వారికి ఆషాడపట్టీ సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త లింగమనేని పూర్ణ భాస్కరరావు దంపతులు, ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా గురు పౌర్ణమి

● కిటకిటలాడిన సాయిబాబా ఆలయాలు

తెనాలి రూరల్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): గురుపౌర్ణమి వేడుకలు మండలవ్యాప్తంగా గురువారం ఘనంగా నిర్వహించారు. గ్రామాల్లోని షిరిడి సాయిబాబా మందిరాలను గురు పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని పూలతో, విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు. ఉదయం నుంచి బాబావారి ఆలయాల్లో భక్తులతో కిక్కిరిసి దర్శనమిచ్చాయి. నందివెలుగులో షిర్డి సాయిబాబా మందిరం, సంగంజాగర్లమూడిలో సాయిబాబా మందిరం, అంగలకుదురులో ఆలపాటి వెంకట్రామయ్య ఆధ్వర్యంలో షిరిడి సాయిబాబు మందిరం, కొలకలూరులోని జ్ఞానసాయి మందిరంలో ప్రత్యేక పూజలు జరిపారు. అన్నప్రసాద వితరణ చేశారు. అదే విధంగా పలు గ్రామాల్లో గురుపౌర్ణమి వేడుకలు వైభవంగా జరిపారు. పెద్దసంఖ్యలో భక్తులు బాబావారిని దర్శించి ప్రత్యేక పూజలు జరిపారు.

● కొల్లిపర: గురుపౌర్ణమి సందర్భంగా మండల కేంద్రం కొల్లిపర శ్రీషిర్డీసాయి బాబా మందిరంలో గురువారం ఘనంగా పూజలు నిర్వహించారు. సాయిబాబాకు వివిధ అభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. మహాగణపతిపూజ, శతిఘటాభిషేకం అఖండ సాయినామకీర్తన, సాయి సహస్ర నామార్చన, శ్రీసాయి సత్యవ్రత కల్పాన్ని భక్తులతో పండితులు చేయించారు. సుమారు 125మంది మహిళలు సామూహికంగా వ్రతాన్ని నిర్వహించారు. అనంతరం సాయిబాబా ఉత్సవ విగ్రహాన్ని ట్రాక్టర్‌పై ఉంచి గ్రామ పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. పండితులు కుమారస్వామి, కుటుంబరావు సాయినాథుడి వృత్తాంతాన్ని వివరించారు. 5వేల మందికి కమిటీ సభ్యులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు గుదిబండి చినవెంకటరెడ్డి, జొన్నల అమ్మిరెడ్డి, అవుతు కృష్ణారెడ్డి, కూరపాటి రవిశేఖర్‌రెడ్డి పర్యవేక్షించారు. ఇదే విధంగా మండలంలోని వల్లభాపురం, మున్నంగి, పిడపర్తిపాలెం, తూములూరు, సిరిపురం గ్రామాల్లోని సాయిబాబా మందిరంలో గురుపౌర్ణమి ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు.

● పొన్నూరు టౌన్, చేబ్రోలు: పొన్నూరు, చేబ్రోలు మండలాల్లో గురువారం గురు పౌర్ణమి వేడుకలు వైభవంగా జరిగాయి. సాయి మందిరాల్లో గురు పౌర్ణమిసందడి నెలకొంది. పొన్నూరు పట్టణంలోని సాయినగర్‌లో సాయిబాబాకు పంచామృత అభిషేకాలు, సాయి చాలీసా పారాయణం, విశేష అర్చనలు జరిగాయి. జీబీసీ రోడ్‌లో ఉన్న షిర్డి సాయిబాబా మందిరంలో ప్రత్యేక పూజలు జరిగాయి. గురుపౌర్ణమి పురస్కరించుకొని భక్తి పాటల విభావరి ఆకట్టుకుంది. భక్తులకు అన్నప్రసాద వితరణ ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని పాత పొన్నూరు శ్రీషిర్డి సాయి మందిరం, రైల్వే స్టేషన్, రోడ్డులోని సాయి మందిరంతో పాటు బావనగర్ కాలనీలోని సాయి మందిరంలో ప్రత్యేక పూజలు జరిగాయి. మండల పరిధిలోని మామిళ్ళపల్లి, ములుకుదురు, చింతలపూడి, నండూరు తదితర గ్రామాల్లోని సాయి మందిరాల్లో గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. గురుపౌర్ణమి పురస్కరించుకొని సాయి చిత్ర పటాలు, పాదుకలను పల్లకి సేవ ద్వారా ఊరేగించారు. చేబ్రోలు మండలంలోని చేబ్రోలు, వేజెండ్ల, శెలపాడు తదితర గ్రామాల్లో షిర్డిసాయి మందిరాల్లో గురు పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలయాలకు విచ్చేసిన భక్తులతో అభిషేకాలు జరిపించారు. మందిర నిర్వాహకులు భక్తులకు అన్న ప్రసాదాన్ని వితరణ చేశారు.

● పొన్నూరు టౌన్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): గురుపౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని యోగా గురువు మలిశెట్టి సుబ్రహ్మణ్యం దంపతులను శిష్యులు గురువారం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఆకుల సాంబశివరావు, దమ్మాల వెంకటేశ్వర్లు, కాజా, సురేష్, కరుణశ్రీ, సుధారాణి, పొట్లూరి సత్య శ్రీనివాస్ పాల్గొన్నారు.





ప్రత్యేక అలంకారంలో సాయినాథుడు, దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

● తెనాలి రూరల్: శాకాంబరిదేవి అలంకారంలో పార్వతీదేవి అమ్మవారు భక్తుల పూజలందుకున్నారు. మండలంలోని కొలకలూరులో ప్రసిద్ధిచెందిన శ్రీపార్వతి సమేత శ్రీఅగస్త్యేశ్వరస్వామి వారి ఆలయంలో వివిధ రకాల పండ్లు, కూరగాయలు, ఆకుకూరలతో అమ్మవారిని శాకాంబరిగా అలంకరించారు.

● తెనాలి అర్బన్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు ఆలయాలలో అమ్మవార్లను గురువారం శాకాంబరి అలంకారం గావించారు. ఆషాడ మాసం పురస్కరించుకుని వివిధ రకాల కూరగాయలు, పండ్లతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. శ్రీవాసవీ ఆలయం, మారీసుపేటలోని శ్రీబాలత్రిపురసుందరి ఆలయం, రామలింగేశ్వరపేట గంగాపార్వతీ అమ్మవారిని, పాత శివాలయంలో పర్వత వర్ధిని అలంకారంలో శాకాంబరి అమ్మవారిగా అలంకరించారు. మహిళ భక్తులు ఆలయాలలో భజనలు, కీర్తనలు ఆలపించారు.



తెనాలిలోని వివిధ ఆలయాల్లో శాకాంబరి దేవి అలంకారంలో పార్వతీదేవి అమ్మవారు

● తెనాలి అర్బన్: పట్టణంలోని సాయిబాబా ఆలయాలలో గురువారం గురుపౌర్ణమి పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. సాయినాథుని విగ్రహ ప్రాంగణాన్ని పూలతో తీర్చిదిద్దారు. ఉదయం అభిషేకాలు, అనంతరం హారతి, ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. మారీసుపేట అప్పలస్వామి ఆలయంలో మూడు రోజులుగా ప్రత్యేక పూజలు చేపట్టారు. దత్తాత్రేయుడు, సాయిబాబాలకు విశేష పూజలు జరిపారు. ధర్మకర్త శివానంద కుమార్, నారాయణస్వామి, ఆంజనేయ ప్రసాద్, అర్చకులు సుబ్రహ్మణ్య శర్మ ఏర్పాట్లు గావించారు. బోసురోడ్డులోని స్వరాజ్ టాకీసు సెంటర్‌లో ఉన్న సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. బాబాను దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో బారులు తీరారు. పలు ఆలయాలలో భక్తులకు అన్నదానం చేశారు. మారీసుపేట దత్తసాయి ఆలయంలో కాగడ హారతి, ఏకాదశి రుద్రాభిషేకం, వజ్రకవచ పారాయణ, భజన కార్యక్రమాలు నిర్వహించి రాజస్థాన్ మేళంతో 108 పల్లకీ ప్రదక్షిణలు చేశారు. రేటూరి నాగసాయి పర్యవేక్షించారు. రూరల్ మండలం నందివెలుగులో దత్తాత్రేయుడు, సాయినాధులకు సుగంధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు. మహిళ బృందం విష్ణు సహస్రనామం, లలితా గోవిందం, లలిత సహస్రం నిర్వహించారు. హరిప్రసాద్, శరదా చలపతి, సుకుమార్, భవన్నారాయణ, పార్వతి, పద్మ పాల్గొన్నారు. రెండు వేల మందికి అన్నదానం చేశారు.

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కూటమి పాలన

● సుపరిపాలన తొలిఅడుగులో ఎమ్మెల్సీ ఆలపాటి

తెనాలి రూరల్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం అందిస్తూ సుపరిపాలన సాగిస్తోందని కృష్ణా, గుంటూరు జిల్లాల ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ చెప్పారు. సుపరిపాలనలో - తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా గురువారం పట్టణంలోని 12, 13వ వార్డులలో పార్టీ శ్రేణులతో కలిసి ఆలపాటి రాజేంద్రప్రసాద్ పర్యటించారు. వార్డులోని ప్రజల సమస్యలను ప్రత్యేక యాప్‌లో నమోదు చేసుకుని సత్వర పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ సుపరిపాలనలో - తొలి అడుగు కార్యక్రమం ద్వారా వార్డులలో ప్రజలను కలుసుకుని ప్రభుత్వ పనితీరుపై వారి అభిప్రాయాలను తెలుసుకోవడం జరిగిందన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్రంలో విధ్వంసపాలన తప్ప అభివృద్ధి వైపు అడుగులు వేసిందేమీ లేదని ఆరోపించారు. ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చడం జరుగుతుందని ఆలపాటి స్పష్టం చేశారు. కార్యక్రమంలో పెద్దసంఖ్యలో కూటమి నాయకులు, కార్యకర్తలు, తెలుగు మహిళలు తదితరులు పాల్గొన్నారు.



వార్డు పర్యటనలో సమస్యలు తెలుసుకుంటున్న ఆలపాటి రాజేంద్రప్రసాద్

ఘనంగా టౌన్‌చర్చి శత వార్షికోత్సవం

తెనాలి అర్బన్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బోసురోడ్డులోని టౌన్ చర్చి శత వార్షికోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. క్రీస్తు దేవాలయం ఉత్సవాలను మూడు రోజులు పాటు నిర్వహిస్తున్నారు. కేరళ మాజీ సబ్ జడ్జి జోసఫ్, మాజీ జూనియర్ జడ్జి జేసురత్నకుమార్, ప్రొఫెసర్ బీసీ పాల్, ప్రొఫెసర్ కొల్లూరు రిచర్డ్ సన్, జోసఫ్ ప్రభాకర్ పాల్గొని సందేశం ఇచ్చారు. ప్యారిస్ పాస్టర్ యేసురత్నం, పాస్టర్లు లెనిన్‌బాబు, సాల్మన్‌రాజులు వాక్య సందేశం ఇచ్చారు. కమిటీ సభ్యులు డేవిడ్‌రాజు, ప్రకాశరావు, వేమయ్య, అంబేద్కర్, దేవదానం, బుజ్జిబాబు తదితరులు పర్యవేక్షించారు. ఉత్సవాలు పురస్కరించుకుని చర్చితోపాటు ప్రధాన మార్గాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. పెద్ద సంఖ్యలో క్రైస్తవులు ప్రార్థనల్లో పాల్గొన్నారు.



శతవార్షికోత్సవంలో పాల్గొన్న కమిటీ సభ్యులు, పాస్టర్లు